నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 19-7-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 305 | పేజీలు: 4 | వెల: రూ.1/-

మాస్కు ధరించకపోతే రూ.వెయ్యి జరిమానా: రాచకొండ సీపీ

హైదరాబాద్, జులై 18: కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరు తప్పనిసరిగా మాస్కు ధరించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ సూచించారు. మాస్కు ధరించకపోతే రూ.1000 జరిమానా విధిస్తామని ప్రకటించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్లకు చెందిన 31 మంది సిబ్బంది కరోనాను జయించి ఈ రోజు విధుల్లో చేరారు. వారిని ఘనంగా సత్కరించిన కమిషనర్, కరోనాకు సంబంధించి వారి అనుభవాలను తెలుసుకున్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కరోనాతో కలిసి జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు.

ఆగని ప్రైవేట్ ఆస్పత్రుల దందా

విపక్షల ఆరోపణలపై పట్టించుకోని సర్కార్

సోషల్ మీడియా ద్వారా గగ్గోలు పెడుతున్న పేషెంట్లు

హైదరాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): ప్రైవేట్ ఆస్పత్రుల్లో కరోనా చికిత్సల కోసం తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలు అస్సలు అమలు కావడం లేదు. పేషంట్లకు ఇచ్చిన మందుల ఆధారంగా వారు తమ ఇష్టం వచ్చినట్లుగా బిల్లులు వేస్తున్నారు. కరోనా బారిన పడ్డ రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితే.. లక్షల్లో బిల్లుల మోత మోగుతోంది. దీనిపై ఇప్పటికే ప్రతిపక్షాలు గళమెత్తాయి. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. అయినా ప్రభుత్వంలో చలనం రావడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కరోనా చికిత్సల కోసం గత నెలలో ప్రైవేట్‌కి కేసీఆర్ సర్కార్ అనుమతినిచ్చిన తరవాత అనేక ఆరోపణలు వచ్చాయి. ఐసీఎంఆర్ గైడ్‌లైన్స్ పాటించే ఆస్పత్రుల్లో వైద్యుల సూచనల మేరకే కరోనా వ్యాధి లక్షణాలు ఉన్న రోగులకు పరీక్షలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు గత జూన్ 15న ఓ సర్క్యులర్ విడుదల చేసింది. కరోనా టెస్టులకు ఫీజు రూ.2,200గా నిర్ణయించారు. ఇంటికి వచ్చి పరీక్షిస్తే రూ.2800. అలాగే కరోనా రోగులకు వెంటిలేటర్ లేకుండా ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తే రోజుకు రూ. 7,500, ఐసోలేషన్‌లో ఉంచితే రోజుకు రూ.4,000, వెంటిలేటర్‌పై ఉన్న వారికి రోజుకు రూ. 9,000 చార్జి వసూలు చేయవచ్చని ఆ సర్క్యులర్‌లో పేర్కొంది. అయితే యాంటి వైరల్ డ్రగ్ అవసరమైతే సపరేట్ చార్జీలు వసూలు చేయవచ్చని తెలిపింది. అయితే ఫీజుల అమలు బాధ్యతను మాత్రం గాలికొదిలేసింది. ప్రైవేట్ ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న ఆసుపత్రులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని బాధితులు మండిపడుతున్నారు. ప్రభుత్వం తీరు గర్హనీయమని ఖండిస్తున్నారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్, బిజెపి తదితర పార్టీలు డిమాండ్ చేశాయి. అయితే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

500 మి. లీ ప్లాస్మాతో ఇద్దరు కరోనా బాధితుల ప్రాణాలు కాపాడవచ్చు : సీపీ సజ్జనార్

హైదరాబాద్,జులై18: కరోనా నుంచి కోలుకున్న వారు దానం చేసే 500 మి. లీ ప్లాస్మాతో మరో ఇద్దరు కరోనా బాధితుల ప్రాణాలను కాపాడవచ్చని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అన్నారు. కరోనా బారిన పడి కోలుకున్న వారు ఇతరుల కోసం స్వచ్ఛందంగా వచ్చి ప్లాస్మా దానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న కరోనా బారిన పడి కోలుకున్న బాధితులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో వేల మంది కరోనబారిన పడుతున్నారని వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. కరోనా వైరస్ నుంచి కోలుకున్న వారు ముందుకు వచ్చి ప్లాస్మా దానం ఇవ్వాలని కోరారు. కరోనా వైరస్ రోగ నిరోధకశక్తిపై ప్రభావం చూపుతోందన్నారు. ఇప్పటికే ఎంతో మంది పోలీసులు కరోనా బారిన పడి కోలుకుని ప్లాస్మా ఇవ్వడానికి అంగీకరించినట్లు పేర్కొన్నారు. అలా ముగ్గురిని కాపాడి వారి కుటుంబాలను ఆదుకున్నామన్నారు. ప్లాస్మా దానం చేసినప్పటికీ 24 గంటలు నుంచి 72 గంటల్లో శరీరంలోకి ప్లాస్మా వచ్చి చేరుతుందని సజ్జనార్ తెలిపారు.

చరిత్రలో నేటినిజం



కం॥ ధీరుడు "మంగళపాండే"
భారత వీర తనయునకు ప్రతిసతియగుచున్
తొలుగ సాంస్కృతులపై
బారుచు లోకమ్ము నందు పూజలనుగొనెన్!!

(జులై 19 మంగళ్‌పాండే జయంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210

ప్లాస్మా దానానికి ముందుకు రండి

కోలుకున్న కరోనా వ్యక్తులకు సిపి సజ్జన్నార్ పిలుపు

హైదరాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): కరోనా సోకి రికవరీ అయిన వారందరూ ఇర కరోనా పేషెంట్లను దక్కించుకునేందుకు ప్లాస్మా దానానికి ముందుకు రావాలని సైబరాబాద్ పోలీస్ తరుపున సీపీ సజ్జనార్ పిలుపునిచ్చారు. వారు ఇచ్చే ప్లాస్మా ఎంతోమందికి ప్రాణం నిలబెట్టగలదని అన్నారు. కరోనాతో కోలుకున్న వారికి సిపి అభినందనలు, శుభాకాంక్షలు తెలియ జేశారు. ఇందులో పోలీస్ విభాగంలో పనిచేస్తున్న వారు కూడా ఉన్నారని అన్నారు. చాలా మంది కరోనాతో ఆస్పతుల్లో చేరుతున్నారని... కరోనా వైరస్ రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపుతుందని అన్నారు. ఈ కోవిడ్ 19 బారిన పడి బయట పడిన వారు ముందుకు వచ్చి ప్లాస్మా ఇవ్వాలని సీపీ కోరారు. మీరు ఇచ్చే 500 ఎమ్ఎల్‌తో ఇద్దరు రోగులను కాపాడిన వారు అవుతాని తెలిపారు. ఇప్పటికే ఎంతో మంది పోలీసులు కోవిడ్ బారిన పడి కోలుకున్నారన్నారు. సైబరాబాద్ పోలీసులు ముందుకు వచ్చి ప్లాస్మా ఇవ్వడానికి అంగీకరించారని...దీంతో ముగ్గురిని ఆదుకున్నారని తెలిపారు. మూడు కుటుంబాలను కాపాడారని అన్నారు. ఎవరైనా ప్లాస్మా ఇవ్వాలనుకున్నవారు 9490617440కి సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ప్లాస్మా సేకరణ ఉద్యమంగా మారాలన్నారు. మనమంతా మరికొందరికి ప్రాణాలు ఇద్దామన్న సంకల్పంతో ముందుకు సాగుదమన్నారు.

కరోనా చికిత్సకు ఉపయోగిస్తున్న ఔషధాల బ్లాక్ మార్కెట్ నేపథ్యంలో తన కార్యాలయంలో ఔషధ డీలర్లతో సమావేశమైన మంత్రి ఈటెల రాజేందర్

రైతుల సంక్షేమం కోసమే రైతు వేదికల నిర్మాణం

సిఎం కెసిఆర్ సంకల్పం మేరకు నిర్మాణాలు -మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్,జూలై18(ఆర్ఎన్ఎ): రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం రైతు వేదిక భవనాలు నిర్మిస్తున్నట్లు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతువేదికల నిర్మాణం జోరుగా సాగుతోందని అన్నారు. వచ్చే దసరా నాటికి వీటిని పూర్తి చేయాలన్న సిఎం కెసిఆర్ సంకల్పం మేరకు నిర్మాణాలు చేస్తున్నామని అన్నారు. శనివారం నిర్మల్ రూరల్ మండలం చిట్యాల గ్రామంలో రైతువేదిక నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయనికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. రైతులందరినీ సంఘటితం చేసేందుకు రైతు వేదికల నిర్మాణం చేపట్టాలన్నదే సీఎం కేసీఆర్ ఆలోచన అని, రైతన్నల సమిష్టి నిర్ణయాలకు ఇవి వేదికలుగా పని చేస్తాయని తెలిపారు. అలాగే హరితహారంలో భాగంగా మంత్రి మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ హరిత హారంలో భాగంగా మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం సారంగపూర్ మండలం వైకుంఠపూర్ గ్రామంలో స్వర్ణవాగు పైన రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న చెక్ డ్యాం పనులకు మంత్రి భూమి పూజ చేశారు. రైతు బాగుంటేనే రాష్ట్రం పచ్చగా ఉం టుందని నమ్మిన సీఎం కేసీఆర్, వారి కోసం సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు.ఏ రాష్ట్రంలోనూ లేని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం దేశం చూపు తెలంగాణ వైపు ఉన్నదని పేర్కొన్నారు. ప్రధానంగా రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. గృహ వినియోగదారులతో పాటు రైతులకు కరెంట్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

కొనసాగుతున్న సచివాలయ కూల్చివేత

పదినెలల్లో నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రణాళిక

నిధులు సమకూర్చడంపై ఆర్థికశాఖ కసరత్తు

హైదరాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాత సచివాలయ కూల్చివేత పనులు వేగంగా జరుగుతున్నాయి. శుక్రవరాం మధ్యాహ్నం హైకోర్టు ఆదేవాలు వెలువడిన వెంటనే కూల్చివేతలు మళ్లీ మొదలయ్యాయి. శనివారం కూడా కూల్చివేతలు వేగంగా సాగుతున్నాయి.

దీంతో కూల్చివేత రెండు రోజుల్లో పూర్తి కాగలదని భావిస్తున్నారు. ఇక, తెలంగాణ కొత్త సమీకృత సచివాలయ నిర్మాణాన్ని 10 నెలల్లోనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్త సచివాలయానికి సంబంధించిన నిర్మాణ ప్రతిపాదనలు ఆర్థిక శాఖ ముందుకు వెళ్లనున్నాయి. ప్రస్తుతం ఉన్న సచివాలయ భవనాల కూల్చివేత, శిథిలాల తరలింపు పక్రియను మరో 20 రోజుల్లో పూర్తిచేసి... కొత్త సచివాలయ భవనాల నిర్మాణ పనుల్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. శ్రావణ మాసంలోనే కొత్త భవనాల నిర్మాణం ప్రారంభం కానుంది. అందుబాటులో ఉన్న స్థానిక వనరులతోనే కొత్త భవనాల నిర్మాణం మొదలుపెట్టాలన్న పట్టుదలతో ప్రభుత్వం ఉంది. కొత్త సచివాలయంలోని ఛాంబర్లు, ప్లోర్లు, ల్యాండ్ స్కేప్‌లు, పార్కింగ్, గుడి, బడి, మసీదు, బ్యాంకు సహా ఇతర సౌకర్యాలపై మంత్రులు, అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఇప్పటికే ప్లాన్లు సిద్ధం చేశారు.

హైకోర్టు సూచనల మేరకు అనుమతులను కూడా తీసుకోనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింప చేసే విధంగా కొత్త సచివాలయ భవన సముదాయ నిర్మాణం జరగాలని, అదే సందర్భంలో రాష్ట్ర పరిపాలనా కేంద్రానికి అవసరమైన అన్ని సౌకర్యాలు, సదుపాయాలు ఉండాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పట్టుదలగా ఉన్నారు.

రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను, సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలి. అదే సందర్భంగా పూర్తి సౌకర్య వంతంగా ఉండాలి. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ప్రధాన కార్యదర్శితో పాటు కార్యదర్శులు అంతా అందులోనే తమ విధులు నిర్వర్తించేలా ఉండాలి. సమీకృత కార్యాలయాలు ఉండాలన్న పట్టుదలతో సిఎం కెసిఆర్ ఉన్నారు. మంత్రులు, కార్యదర్శులు ఒకే చోట ఉండాలి. సెక్రటేరియట్ సమీపంలోనే అన్ని ప్రభుత్వ శాఖల విభాగాధిపతుల కార్యాలయాల సముదాయాన్ని కూడా నిర్మిస్తాం. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగమంతా ఒకే దగ్గర ఉంటుంది'అని సీఎం కేసీఆర్ వెల్లడించారు. సౌకర్యాలు, సదుపాయాలు ఎలా ఉండాలనే విషయంలో తుది నిర్ణయం తీసుకుని టెండర్లు పిలవాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అమర్‌నాథ్ యాత్రపై దాడికి ఉగ్రవాదుల కుట్ర

శ్రీనగర్:,జులై18 అమర్‌నాథ్ యాత్రపై దాడి చేయడానికి ఉగ్రవాదులు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులు పన్నిన కుట్రకు సంబంధించిన సమాచారం జమ్ముకశ్మీర్‌లోని భద్రతా దళాలకు అందిందని ఆర్మీ అధికారి చెప్పారు. వార్షిక తీర్థయాత్రకు అడ్డుపడకుండా ఉండేందుకు అన్ని వ్యవస్థలు, వనరులు సిద్ధాంగా ఉన్నాయని ఆయన నొక్కి చెప్పారు.జూలై 21 న యాత్ర ప్రారంభం కావడానికి నాలుగు రోజుల ముందు జరిగిన ఎన్ కౌంటర్లో జైష్-ఏ- మొహమ్మద్ కమాండర్ తోపాటు ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. చనిపోయిన వారు అమర్ నాథ్ యాత్రికులపై దాడి చేసేందుకు బయల్దేరినట్లు సమాచారం.''యాత్రను లక్ష్యంగా చేసుకోవడానికి ఉగ్రవాదులు తమ వంతు ప్రయత్నం చేస్తారని ఇన్‌పుట్‌లు ఉన్నాయి. కాని వారు యాత్రను అడ్డుపడకుండా, శాంతియుతం గా సాగేలా చూడడానికి మా వ్యవస్థలు, వనరులను సిద్ధంగా ఉంచాం" అని కమాండర్ బ్రిగేడియర్ వివేక్ సింగ్ ఠాకూర్ తెలిపారు. "అమర్‌నాథ్ యాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత ంగా జరుగుతుందని, భద్రతా పరిస్థితులు అదుపులో ఉంటాయని భావిస్తున్నాం'' అని ఆయన చెప్పారు.యాత్రికులు ఉపయోగించే 44 నంబర్ జాతీయ రహదారి విస్తీర్ణం సున్నితంగా కొనసాగుతు న్నదని బ్రిగేడియర్ ఠాకూర్ అన్నారు. "ఈ మార్గం కొంచెం సున్నితమైనది. సోనామార్గ్ (గాండెర్బల్) వరకు వెళ్ళడానికి యాత్రికులు ఈ మార్గాన్ని ఎంచుకుంటారు. అమర్‌నాథ్ గుహ వరకు వెళ్ళడానికి చురుకుగా ఉండే ఏకైక మార్గం ఇది'' అని ఆయన వెల్లడించారు. యాత్రికుల భద్రత నిమిత్తం హైవే, భగవతి నగర్ బేస్ క్యాంప్‌లో సీఆర్పీఎఫ్ బలగాలను మోహరించారు. లఖన్‌పూర్, దిగువ ముండా శ్రీనగర్‌లో శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ ప్రయాణికులకు స్క్రీనింగ్ ఉంటుంది. జూలై 21 నుంచి ప్రతిపాదిత ప్రయాణానికి సంబంధించిన భద్రతా పనులు పూర్త య్యాయి. ప్రతిరోజూ 500 మంది భక్తుల ను మాత్రమే దర్శనానికి అనుమతించనున్నారు.

అమర్‌నాథ్ సందర్శించిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

శ్రీనగర్, జులై 18: కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రెండు రోజుల లడఖ్, జమ్ముకశ్మీర్ పర్యటనలో ఉన్నారు. మొదటి రోజు లేహ్‌లో గడిపిన రక్షణ మంత్రి జమ్ముకశ్మీర్‌లో ఉన్నారు. అక్కడ నుంచి బాబా అమర్‌నాథ్‌ను దర్శించుకునేందుకు పవిత్ర గుహకు చేరుకున్నారు. ఇక్కడ దాదాపు ఒక గంట గడిపారు. ప్రత్యేక పూజలు చేశారు. రక్షణ మంత్రి వెంట చీఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్, ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నారావణే కూడా పవిత్రగుహలో అమర్ నాథ్ లింగాన్ని దర్శించుకున్నారు. అనంతరం నియంత్రణ రేఖలోని కుప్వారా వద్ద ఆర్మీ ఫార్వర్డ్ పోస్టుకు చేరుకున్నారు.

అంతకుముందు, రాజ్ నాథ్ సింగ్ శుక్రవారం లేహ్ కు చేరుకున్నారు. అక్కడ ఆర్మీ, వైమానిక దళం యుద్ధ నైపుణ్యాలను చూడటమే కాకుండా, చైనా సరిహద్దుకు సమీపంలో ఉన్న అగ్రిమ్ అవుట్ పోస్టుకు వెళ్లి సైనికులను ప్రోత్సహించాడు. లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసీ) చైనా ఆక్రమణపై వివాదం మధ్య రక్షణ మంత్రి శుక్రవారం లేహ్-లడఖ్‌లోని లుకుంగ్ మిలిటరీ ఔట్‌పోస్టును సందర్శించారు. వీరి పర్యటన సరిహద్దుల్లో మోహరించిన దళాల మనోధైర్యాన్ని పెంచింది.

కరోనా చికిత్సకు మందుల కొరత రావద్దు

డీలర్లు, ఔషధ తయారీదారులకు మంత్రి ఈటెల సూచన

అక్రమంగా మందులు అమ్ముతున్న వారి పట్టివేత

హైదరాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో మందుల కొరత రాకుండా చూడాలని, బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మందుల కొరతపై వస్తున్న వార్తల నేపథ్యంలో ఆయన శనివారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఫార్మా డీలర్లు, ఔషధాల తయారీదారులు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కరోనా చికిత్సకు సంబంధించిన ఔషధాల సరఫరాపై చర్చించారు. కరోనా చికిత్సలో భాగంగా ఉపయోగించే అజిత్రోమైసిన్, డాక్సీసైక్లిన్, డాక్సామెతాసోన్, మిథైల్ ప్రెడ్నిసోలొన్ మందులను వీలైనంత తొందరగా సరఫరా చేయాలని సూచించారు. విటమిన్-డీ, సీ, మల్టీవిటమిన్, జింక్ వంటి ఔషధాలను మందుల దుకాణాలు, దవాఖానల్లో సరిపడినన్ని ఉంచాలని చెప్పారు. అలాగే ఎక్కడా మందుల కొరత రాకుండా చూసుకోవాలన్నారు. బ్లాక్‌మార్కెట్లో ఔషధాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఇదిలావుంటే కోవిడ్ రోగుల వద్ద కొట్టేసిన ఇంజెక్షన్లు, మందులను కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న ఓ మెడికల్ దుకాణం యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. దుకాణదారుడితో పాటు మరో ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటన నగరంలోని మెహదీపట్నంలో చోటుచేసుకుంది. మెహదీపట్నం ప్రాంతంలోని ఆలివ్ అనే ప్రైవేట్ ఆసుపత్రిలో వార్డ్ బాయ్ గా పనిచేస్తున్న రవి రాజు, అజిస్ అదేవిధంగా సమీరా అనే ఆస్పత్రిలో పనిచేసే ఒబేద్ అలీ, అశ్వక్ అలీ, ఎల్బీనగర్‌లోని మెడిసిస్ ఆసుపత్రిలో పనిచేసే సునీల్ మరో సేల్స్‌మెన్ మజీద్ వీరంతా ఇన్‌పేషెంట్‌గా ఉన్న కోవిడ్ రోగుల వద్ద నుంచి ఇంజెక్షన్లు, మందులను దొంగిలిస్తున్నారు. కొట్టేసిన ఇంజెక్షన్లు, మందులను మెహదీపట్నంలోని ఓ మెడికల్ దుకాణంలో అమ్మేవారు. మెడిసన్ ఖరీదు రూ. 4,500 అయితే బ్లాక్‌లో రూ. 25 వేల నుండి రూ. 35 వేల వరకు విక్రయిస్తు సొమ్ముచేసుకుంటున్నారు. ఫిర్యాదులపై దర్యాప్తు చేపట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని ఎల్బీనగర్ పోలీసులకు అప్పగించారు.

కరోనాతో ఏ ఒక్కరూ చనిపోవద్దు

-ప్లాస్మా దానానికి ముందుకు రావాలి: గవర్నర్

హైదరాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఎవరూ కరోనాతో చనిపోకూడదని.. అదే తన లక్ష్యమని గవర్నర్ తమిళిసై అన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొని మాట్లాడారు. ప్లాస్మా థెరపీ ద్వారా సీరియస్‌గా ఉన్న కరోనా బాధితులను రక్షించవచ్చని చెప్పారు. అలాగే ఈఎస్ఐ ఆస్పత్రిలో ప్లాస్మా థెరపీకి సంబంధించిన అన్ని మౌళిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. కరోనా పాజిటివ్ వచ్చి తగ్గిన వారు ప్లాస్మాను డొనేట్ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. డోనార్స్ ఈఎస్ఐ ఆస్పత్రికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ప్లాస్మా డోనార్ సంతోష్‌కు పుష్ప గుచ్ఛం ఇచ్చి గవర్నర్ అభినందించారు. అలాగే మీడియా ప్రతినిధులు కూడా భౌతిక దూరం పాటించినందుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. తెలంగాణ ప్రజలందరూ ప్రభుత్వం సూచించిన నిబంధనలు పాటించాలని గవర్నర్ సూచించారు

ఛీటింగ్ కేసులను వేగవంతంగా చేధించాలి

-కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్,జులై 18:అమాయక ప్రజలను వివిధ రకాలుగా మోసం చేసిన కేసులను వేగవంతంగా చేధించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కమిషనరేట్‌లోని అధికారులను ఆదేశించారు. సదరు కేసుల్లో నిందితులు ప్రజలను ఆకర్షణీయమైన ప్రకటనలతో ప్రజలను ప్రలోభపెట్టారని, ఇందులో ఎక్కువగా నష్టపోయింది బీద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే ఎక్కువశాతం మంది ఉన్నారని పేర్కొన్నారు.

వివిధ రకాల మోసాలకు సంబంధించిన కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న నేరస్థులు దేశవ్యాప్తంగా ఎంతటి రహస్యప్రాంతాల్లో తలదాచుకున్నా పట్టుకోవాలని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ నేరాల చేధనలో కీలకపాత్రపోషించే ప్రతిస్థాయి పోలీసు అధికారులకు నగదు రివార్డులతోపాటు ప్రభుత్వపరంగా అందజేసే వివిధ రకాల పతకాల ఎంపికకు ప్రతిపాదనలు పంపిస్తామని ప్రకటించారు. మోసపూరిత నేరాల చేధనలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ధృఢసంకల్పంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కష్టజీవుల సొమ్ముతో జల్సాలను చేసే నిందితులను క్షమించేదిలేదని, చట్టపరంగా శిక్షింపబడేలా పగడ్బందీ చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. కష్టజీవులకు వారుమోసపోయిన మొత్తాలను అందించినట్లైతే ప్రజలతో మరింత సత్సంబంధాలు పెంపొంది, పోలీసులకు శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో సహకారం లభించడంతోపాటు పోలీస్‌శాఖ ప్రతిష్ట మరింత పెంపొందుతుందని పేర్కొన్నారు. ప్రజలకు సేవలందించేందుకు లభించే ప్రతి అవకాశాన్ని పోలీసులు సద్వినియోగం చేసుకుని వారి సమర్ధతను చాటుకోవాలని తెలిపారు.

అత్యాశకు పోయి నష్టపోవద్దు

మోసగాళ్ళ మాయమాటలు, ఆకర్షణీయ ప్రకటనలను గుడ్డిగా నమ్మి ప్రజలు మోసపోవద్దని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. తక్కువ వ్యవధిలో రెట్టింపు రాబడులు ఎలావస్తాయని? ఆలోచించాలని సూచించారు. బీద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు తమకష్టార్జితంతో సంపాదించిన మొత్తంలో మిగిలిన వాటిని ప్రభుత్వాలు గుర్తించిన బ్యాంకులు, ఇతర సంస్థల్లో జమచేసుకుని శాశ్వత అవసరాలకోసం మాత్రమే వినియోగించుకోవాలని కోరారు. తక్కువ వ్యవధిలో రెట్టింపు రాబడులు ఎట్టిపరిస్థితుల్లోనూ రావనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. అలాంటి ప్రకటన, లేదా మాయమాటలు ఎవరు చెప్పినా నమ్మకూడదని పేర్కొన్నారు.

రౌడీమూకల కదలికలపై నిఘాఉంచాలి

వివిధ రకాల కేసుల్లో నిందితులై హిస్టరీషీట్లు తెరువబడిన నేరస్థుల కదలికలపై ప్రతినిత్యం నిఘాఉంచాలన్నారు. పోలీస్‌స్టేషన్ల వారీగా ప్రతినెలా రెండుసార్లు నిర్వహించబడుతున్న మేళాలకు గైర్హాజర్ అయ్యే హిస్టరీ షీటర్లను మొదటి విడత హెచ్చరించాలని, వివిధ రకాల కారణాలు చూపుతూ గైర్హాజరవుతున్నట్లయితే వారిని బైండోవర్ చేయించాలని, బైండోవర్ చర్యలను ఉల్లఘించిన వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. అకారణంగా వివిధ రకాల అల్లర్లలో జోక్యం చేసుకునే షీటర్లలందరినీ బైండోవర్ చేయించాలని ఆదేశించారు. రాబోవు బక్రీద్, గణేష్ నవరాత్రోత్సవాలను దృష్టిలో ఉంచుకుని గతంలో మతకలహాలు జరిగేందుకు కారకులై, పోలీసు రికార్డుల్లో కొనసాగుతున్న వారిని సైతం బైండోవర్ చేయించాలని చెప్పారు. బైండోవర్ అమలులో ఉన్న కాలంలో ఉల్లంఘనలకు పాల్పడితే ఒకలక్షరూపాయల వరకు జరిమాన జైలుశిక్ష లేదా రెండునూ విధించబడుతుందని స్పష్టం చేశారు.

అభివృద్ధే సర్కారు లక్ష్యం : మంత్రి హరీశ్ రావు

మెదక్, జులై 18: అభివృద్ధే పరమావధిగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. జిల్లాలోని పాపన్నపేట మండలం యూసుఫ్ పేటలో మంత్రి పర్యటించారు . గ్రామంలో నిర్మించిన డబు టల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాల శంకుస్థాపన తోపాటు ఆయా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థా పనలు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రతి పైసా పేదల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రవ ంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

ముందున్నది ముసళ్ల పండగ

నేటినిజం
ఆదివారం 19-7-2020

ఈ శతాబ్దిలో మానవాళి పాలిట దాపురించిన అతి పెద్ద ఉపద్రవం కరోనా వైరస్ ప్రపంచవ్యాప్తంగా డేంజర్ బెల్స్ మోగిస్తోంది. కేసులు పెరగడమే తప్ప తగ్గడం లేదు. లాక్‌డౌన్ విధించిన సమయంలో ఉన్న కట్టడి ఇప్పుడు లేకుండా పోయింది. రోజురోజుకూ పెరుగుతున్న కేసులకు ప్రజల నిర్లక్ష్యం, ప్రభుత్వాల బాధ్యతారాహిత్యం కూడా తోడయ్యింది. విచ్చలవిడిగా ప్రజలు రోడ్డునపడి రక్షన చర్యలు పాటించక పోవడంతో వైరస్ వ్యాప్తి చేతుల్లో లేకుండా పోయింది. ఇప్పటికి సుమారుగా కోటీ నలభై లక్షల మందికి కరోనా సోకినట్లు లెక్కలు చెబుతున్నాయి. దాదాపు ఆరులక్షల మందిని పొట్టన పెట్టుకున్నది. ఈ వైరస్ వ్యాప్తి అప్రతిహతంగా సాగుతూనే ఉన్నది తప్ప తగ్గడం లేదు. మరణాల రేటు తక్కువగా ఉందనో.. కోలుకుంటున్న వారి రేటు ఎక్కువగా ఉందనో లెక్కలు చెప్పి ప్రభుత్వాలు సంతృప్తి పడుతున్నాయే తప్ప ప్రలజ వేదనను, ఆవేదనలను పట్టించుకోవడం లేదు. వ్యాక్సిన్ ఎప్పుడు అందుతుందో చెప్పలేని పరిస్థితి. జీవనవిధానాలను, జీవనాధార వ్యవస్థలను, ఆర్థిక రంగాలను కరోనా వ్యాధి తీవ్రంగా దెబ్బతీసింది. మనుషుల సంచారాన్ని, సామూహికతను నియంత్రించింది. పూర్తిగా స్తంభింపజేయడం దగ్గర నుంచి, మందకొడిగా మార్చడం దాకా మానవ కార్యకలాపాలన్నిటిని ప్రభావితం చేసింది. దీంతో మన జీవన విధానాలు పూర్తిగా మారాయి. చచ్చినా ఏడ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఎందరో చస్తున్నా వెళ్లి పలకరించలేని పరిస్థితి దాపురించింది. చదువులు, సాంస్కృతిక అంశాలు.. పనిపద్ధతులు సమస్తం మారిపోయాయి. దీనిపై ప్రభుత్వాలు,ప్రజలు సీరియస్‌గా ఆలోచన చేయాలి. ఇక ప్రపంచ వ్యవహారం పక్కన పెట్టి మనదేశానికి సంబంధించిన పరిస్థితిని చూస్తే భారరతదేశంలో మొట్టమొదటి కరోనా కేసు జనవరి 30న కేరళలో నమో దైంది మొదలు ఇప్పటి వరకు కేసులు పెరగడమే తప్ప తగ్గడం లేదు. ఇపపటికే పదిలక్షలను దాటేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఐదున్నర నెలల కరోనా కాలంలో దేశంలో 25వేల మంది దాకా చని పోయారు. ప్రస్తుతం ప్రతిరోజూ కొత్తగా చేరుతున్న కేసుల సంఖ్య 28 వేలు, ఆ పైన ఉంటున్నది. ఈ వేగం ఇట్లాగే కొనసాగితే, త్వరలోనే భారతదేశం తీవ్రమైన ఉపద్రవంలో చిక్కుకుంటుందని గణాంక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇక ముందు, రోజుకు 30 వేలు, 50 వేలు, లక్ష చొప్పున కేసులు పెరిగే రోజు వచ్చినప్పుడు దేశంలోని ఆరోగ్య మౌలిక వసతుల వ్యవస్థ తట్టుకుంటుందా అన్నది ఆందోళనకరమైన ప్రశ్న.

చాలా దేశాలతో పోలిస్తే, భారతదేశంలో వ్యాప్తి, మరణాల రేటు తక్కువగా కనిపిస్తాయి. చాలా తొందరలోనే స్పందించి మార్చి మూడోవారంలోనే, దేశంలో కేసుల సంఖ్య కనీసం వెయ్యికి కూడా చేరకముందే, పూర్తి లాక్‌డౌన్‌ను విధించడం వ్యాప్తి నెమ్మదిగా జరగడానికి కారణమని చెబుతారు. అదే సమయంలో, తొలి రోజుల్లో చూపినంత చొరవను, వ్యూహ నిపుణతను భారతదేశ పాలకులు తరువాత కాలంలో చూపడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. ఆస్పత్రుల్లో వసలుత కొరత, సకాలంలో వైద్యం అందకపోవడం, టెస్టులు చేయక పోవడం మన వ్యవస్థీకృత లోపాలను ఎత్తి చూపుతోంది. భారతదేశం జనాభా 130 కోట్లు. ఆ జనాభాకు ఒక మిలియన్ కేసులు అన్నది పెద్ద విషయం కాదన్న వాదన కూడా పాలకుల మాటల్లో వినిపిస్తున్నది. మొత్తం జనాభాను ప్రాతిపదికగా తీసుకుంటే, అమెరికా, బ్రెజిల్ వంటి దేశాలలోని మరణాల రేటుకు మనకు పోలికే లేదు. ప్రతి మిలియన్‌కు కేసుల సంఖ్యను చూస్తే భారతదేశం 106 వ ర్యాంకులో ఉన్నది. భారత్‌లో ప్రతి పదిలక్షలకు 658 మందికి కరోనా సోకగా, అమెరికాలో దానికి 16రెట్లు, రష్యాలో 5 రెట్ల వ్యాప్తి ఉన్నది. మరణాలలో చూస్తే అమెరికాలో ప్రతి మిలియన్ జనాభాకు 392 మంది మరణిస్తుండగా, భారత్‌లో కేవలం 14.2 మాత్రమే చనిపోతున్నారు. జనాభా నిష్పత్తిని పరిగణించకపోతే, కేసుల సంఖ్య రీత్యా భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉన్నది. మరణాల సంఖ్యలో ఎనిమిదో స్థానంలో ఉన్నది. కొవిడ్ కేసుల సంఖ్య పదిలక్షలకు చేరడం సాంకేతికమేనని, కోలుకున్నవారిని మినహాయిస్తే, ప్రస్తుతం మూడున్నర లక్షల మంది వ్యాధి గ్రస్తులే చికిత్సలో ఉన్నారని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ చెబుతున్నది. ఈ సంఖ్య భారతదేశ సామర్థ్యానికి లోబడే ఉన్నదని, వ్యాప్తి కట్టడికి తీసుకుంటున్న వివిధ చర్యల వల్ల వ్యాధిసోకినవారి సంఖ్యను ఎప్పటికప్పుడు మితిమీరకుండా చూడగలుగు తున్నామని ఆ శాఖ వర్గాలు అంటున్నాయి. కట్టడి చర్యల విషయంలోనే, ముఖ్యంగా దీర్ఘకాలం లాక్‌డౌన్ తరువాతి ప్రస్తుత సడలింపుల దశలోని నియంత్రణల విషయంలో, వివిధ వర్గాలకు అసంతృప్తి ఉన్నది. దేశంలో కొవిడ్ కేసులు లక్ష సంఖ్యను చేరడానికి 110 రోజులు పడితే, ఆ తరువాతి 9 లక్షలు కేవలం 59 రోజుల్లో నమోదయ్యాయి. ఈ 59రోజులు, లాక్‌డౌన్ సడలింపుల తరువాతివే అని వేరే చెప్పనక్కరలేదు. భారతదేశంలో పరీక్షల సంఖ్యను,కేసుల సంఖ్యను, మరణాల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తున్నారని అంతర్జాతీయంగా విమర్శలు ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా భారతదేశంలో చేయవలసినన్ని పరీక్షలు చేస్తే, కేసుల సంఖ్య పెరుగుతుందని, భవిష్యత్తులో ఇండియాలో కరోనా తీవ్రంగా వ్యాప్తి చెందుతుందని వ్యాఖ్యానించారు. ఇప్పటిదాకా ఎదురయిన పరిస్థితిని ఎదుర్కొనేందుకు లాక్‌డౌన్ కాలం తగిన వ్యవధిని, వెసులుబాటును ఇచ్చింది. నిజానికి కఠినమైన కట్టడులు అవసరమైన సమయం ఇదే. గుడులు, హోటళ్లు, మాల్స్ అన్నీ తెరిచేస్తే , వైరస్ చేతులు కట్టుకుని ఉంటుందా అని ప్రజారోగ్యవేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఒక స్పష్టమైన విధానం, కార్యాచరణ ప్రణాళిక, పారదర్శకత వంటివి లేకుండా కరోనాను ఎదుర్కొనడం కష్టమన్నదే నిపుణులందరి అభిప్రాయం. ప్రపంచపు లెక్కలతో భారత్ లెక్కలు పోలిస్తే, అవాంఛనీయమైన ధీమా కలిగినట్టే, భారతదేశంలోని అనేక రాష్ట్రాల లెక్కలను చూసినప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కూడా ఉదాసీనతకు ఆస్కారం ఏర్పడుతుంది. అది మంచిది కాదు. వేగంగా వ్యాప్తి జరుగుతున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే చేరింది. ఆ రాష్ట్రంలో రోజువారీ మరణాలు బెంబేలెత్తిస్తున్నాయి. తెలంగాణ ఇంకా పరీక్షల సంఖ్యను తగినంత పెంచకుండా దోబూచులాడుతున్నది. పరీక్షలకు భయపడితే, పర్యవసానాలకు ఎట్లా సిద్ధపడతారన్న దానికి సమాధానం లేదు.

ఖమ్మం అటవీ ప్రాంతంలో దారుణం

పెట్రోల్ పోసి గిరిజన యువతి దహనం

వివరాల కోసం ఆరా తీస్తున్న పోలీసులు

ఖమ్మం,జూలై18(ఆర్ఎన్ఎ): జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఓ యువతిని దుండగులు పెట్రోల్ పోసి తగలబెట్టారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని బంద్రుగొండ నుంచి పూసుగూడెంవైపు వెళ్లే అటవీ ప్రాంతంలో స్థానికులకు అటవీ ప్రాంతంలో కాలిన మృతదేహం కనిపించింది. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితులు యువతిపై పెట్రోల్ పోసి తగలబెట్టినట్టుగా అనుమానిస్తున్నారు. అక్కడే చుట్టు పక్క గ్రామాలకు చెందిన గిరిజన యువతిగా అనుమానిస్తున్నారు. మృతిచెందిన యువతి ముఖం, శరీరం కాలిపోయి ఉంది. వంటిపై దుస్తులు పాక్షింగా కాలిపోయి ఉన్నాయి. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. దుండగులు లైంగికదాడికి పాల్పడి హత్య చేసి ఉంటారా? ప్రేమ వ్యవహారం కారణంగా హత్య చేసి ఉంటారా? అన్న కోణాల్లో పోలీసులు అనుమానిస్తున్నారు.

గుండెపోటుతో తిర్యాణి ఎఎస్ఐ సిదం దేవ్ మృతి

కుమ్రంభీం ఆసిఫాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): తిర్యానీ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ సిదం దేవ్ రావు(54) గుండెపోటుతో శుక్రవారం మరణించాడు. తిర్యానీ మండలంలోని మాణిక్యాపూర్ గ్రామంలో వాహనాలను తనిఖీలు చేస్తుండగా ఏఎస్ఐ కుప్పకూలిపోయాడు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుండెపోటుతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇటీవల తప్పించుకున్న మావోయిస్టులను గుర్తించే బృందంలో ఏఎస్ఐ ఉన్నారు. ఏఎస్ఐ మృతిపట్ల తిర్యానీ ఎస్ఐ పీ రామారావుతో పాటు పోలీసులు సంతాపం తెలిపారు. ఏఎస్ఐ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. దేవరావు కుటుంబానికి పోలీసు డిపార్ట్ మెంట్ అండగా ఉంటుందని ఎస్ఐ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర మండలం శాంతాపూర్ గ్రామానికి చెందిన దేవరావు.. 1989లో పోలీసు డిపార్ట్‌మెంట్‌లో చేరారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

సిద్దిపేట జిల్లాలో పెరుగుతున్న కరోనా కేసులు

సిద్దిపేట,జూలై18(ఆర్ఎన్ఎ): జిల్లాలో కరోనా విలయతాండవం చేస్తోంది. రోజురోజుకూ జిల్లాలో పాజిటివ్ కేసులు పెరిగిపోతున్నాయి. జిల్లాలో గురువారం నాడు కొత్తగా ఐదు కేసులు నమోదవ్వగా తాజాగా మిరుదొడ్డి మండలంలో మూడు కేసులు నమోదయ్యాయి. దీంతో ఈ మండలంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య నాలుగుకు చేరుకుంది. కాగా.. పాజిటివ్ కేసుల సంఖ్య పెరిగిపోతుండటంతో సిద్దిపేట అర్బన్, రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దస్తవేజు లేఖరుల స్వచ్ఛంద లాక్ డౌన్‌కు నిర్ణయించారు. ఈ నెల 20 నుంచి వచ్చేనెల 8వరకు తమ కార్యాలయాలను పూర్తిగా మూసి వేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన ఉంటుందని దస్తవేజు లేఖరుల యూనియన్ తెలిపింది.ఇకపోతే చేర్యాల డీసీసీ బ్యాంక్ మేనేజర్‌కు కరోనా పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. దీంతో బ్యాంక్ మూసివేసి పలువురు ఉద్యోగులను హోమ్ క్వారంటైన్‌లో ఉండాలని ఉన్నతాధికారులు తెలిపారు. గత పదిరోజులుగా బ్యాంక్‌కు వచ్చిన ఖాతాదారులు, మేనేజర్‌కు సన్నిహితంగా ఉన్నవారు కూడా హోమ్ క్వారంటైన్‌లో ఉండాలని జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారు.

భారత్‌లో ఇంచు భూభాగాన్ని కూడా కదిలించలేరు

-సరిహద్దుల్లో సైనికులను కలసిన రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ,జూలై17(ఆర్ఎన్ఎ): భారత్, చైనాలు సరిహద్దు వివాదాన్ని చర్చల ద్వారానే పరిష్కారం చేసుకోవాలని, అయితే చర్చలు సఫలమవుతాయన్న గ్యారంటీ ఏమీ లేదని భారత రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. నెల రోజుల తర్వాత మళ్లీ లఢక్ వెళ్లిన రాజ్‌నాథ్ సింగ్ సైనికులను కలిసి వారి నుద్దేశించి మాట్లాడారు. ఇప్పటివరకు జరిగిన చర్చలు సమస్యను పరిష్కరించడానికే జరిగాయని, అయితే ఎంతమేరకు ఇవి సఫలమయ్యానేదానిపై గ్యారంటీ ఏమీ లేదని రాజ్‌నాథ్ అన్నారు. అయితే భారత్ భూభాగం నుండి ఒక్క అంగుళం భూమిని కూడా ఏ దేశమూ తీసుకు పోలేదని హామీ ఇచ్చారు. పాంగాంగ్ సరస్సు దగ్గరలోని లుకుంగ్ పోస్ట్‌ను సదర్శించిన సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పై వ్యాఖ్యలు చేశారు. రాజ్‌నాథ్ రెండు రోజుల పర్యటన కోసం లఢక్, జమ్ము కాశ్మీర్ వెళ్లారు. ఆయన వెంట ఢిఫెన్స్ స్టాఫ్ ఆఫ్ చీఫ్ బిపిన్ రావత్, ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవాణెళి కూడా ఉన్నారు. ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చిన ప్రపంచంలో ఏకైక దేశం భారత్ మాత్రమేనని, ఏ దేశంపైన భారత్ దండెత్తలేదని, ఏ దేశపు భూభాగాన్ని తమదిగా చెప్పుకోలేదని, వసుధైక కుటుంబం అనే భావనపై భారత్‌కు నమ్మకముందని రాజ్‌నాథ్ అన్నారు. అశాంతిని భారత్ కోరుకోదని, ఏ దేశపు గౌరవాన్ని కించపరచదని, అలాగని భారత దేశ గౌరవాన్ని కించపరిచేలా ఎవరైనా ప్రయత్నిస్తే గట్టి సమాధానం ఇస్తుందని మంత్రి రాజ్‌నాథ్ అన్నారు.

సచిన్ వర్గంపై 21వరకు చర్యలు తీసుకోరాదు

-రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలు

జయపుర,జూలై18(ఆర్ఎన్ఎ): డిప్యూటీ సీఎం సచిన్ పైలట్... సీఎం అశోక్ గెహ్లోట్‌పై తిరుగుబాటు చేయడంతో.. రాజస్థాన్‌లో రాజకీయం రసవత్తరంగా మారిపోయింది.. కాంగ్రెస్ అధిష్టానం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.. ఇక, డిప్యూటీ సీఎం పోస్టుతో పాటు.. రాజస్థాన్ పీసీసీ చీఫ్ పదవిని సచిన్ పైలట్ కోల్పోయారు... అంతే కాదు.. పైలట్ వర్గంపై కూడా వేటు వేస్తూ వస్తున్నారు.. ఈ తరుణంలో.. సచిన్ పైలట్ వర్గానికి రాజస్థాన్ హైకోర్టులో కాస్త ఊరట లభించింది.. ఈనెల 21వ తేదీ వరకు సచిన్ పైలట్ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పీకర్‌ను ఆదేశించింది హైకోర్టు.. ఇక, తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసిన హైకోర్టు.. మంగళవారం వరకు స్పీకర్ జారీ చేసిన నోటీసుపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ఆదేశించింది. అయితే, రాజస్థాన్ స్పీకర్ తరపున హైకోర్టులో వాదనలు వినిపించిన అభిషేక్ సింఘ్వి... స్పీకర్ జారీ చేసిన నోటీసును సవాలు చేయడం తొందరపాటు చర్యగా.. ఏవైనా అభ్యంతరాలుంటే, నోటీసులందుకున్న ఎమ్మెల్యేలు స్పీకర్ ముందు ప్రస్తావించవచ్చని వాదించారు.

ఉద్యోగాల కల్పనలో చిత్తశుద్ధి చాటిన టిసిఎస్

కంపెనీలతో కేంద్రం చర్చించాలి

ఉద్యోగులను తొలగించకుండా చర్చించాలి

న్యూఢిల్లీ,జూలై18(ఆర్ఎన్ఎ): కరోనా సమయం.. ఉన్న ఉపాధియే పోయిందన్న బాధలో ఉన్న ప్రజలకు ఉపశమనం కలిగించే ప్రకటనలు లేదా చర్యలు ఇంతవరకు ఎక్కడా కానరావడం లేదు. కేంద్రంపై నెపం నెట్టిన రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు దులిపేసుకుంటున్నాయి. కొత్తగా ఉద్యోగాలు కల్పించడం లేదా, ఉపాధి మార్గాలను సృష్టించడం లేదు. ఈ దశలో ఇప్పటికే అనేక ఐటి, ఇతర సంస్థలు ఉన్న ఉద్యోగులను కుదించాయి. దీంతో లక్షలమంది ఉద్యోగులపై దెబ్బపడింది.. కొన్ని ఉద్యోగాలు ఊడిపోగా.. మరికొంత మంది.. ఉద్యోగాలకు రాజీనామా చేసి.. సొంత ప్రాంతాలకు వెళ్లిపోయిన పరిస్థితి. ఇక, చిన్న కంపెనీలు కొన్ని మూతపడిపోయాయి.. పెద్ద కంపెనీలను సైతం కరోనావైరస్ దెబ్బకొట్టింది.. ఈ సమయంలో.. ఉన్న ఉద్యోగాలకే గ్యారంటీ లేకపోగా.. టాటా కన్‌స్టలెన్సీ సర్వీసెస (టీసీఎస్) మాత్రం భారీగా ఉద్యోగాల భర్తీకి పూనుకొంది.. కరోనాతో ప్రపంచం మొత్తం విపత్కర పరిస్థితులనెదుర్కొంటోన్న ప్రస్తుత పరిస్థితుల్లో...

నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. దేశవ్యాప్తంగా మొత్తం 40 వేల మందికి కొత్తగా ఉద్యోగాలను కల్పించబోతున్నట్లు టీసీఎస్ ఇటీవల ప్రకటించింది. ఇది కొంత మేర ఊరట కలిగించే విషయం. నిజానికి ఆయా కంపెనీలతో కేంద్రమే మాట్లాడి వారికి ఇన్సెంటివ్‌లు ఇవ్వడంతో పాటు ఉద్యోగులను తొలగించ కుండా చేయాల్సి ఉంది. అయితే ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉన్న ఉద్యోగులను తొలగించకుండా తీసుకున్న చర్యలు శూన్యం. ఈ విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలది ఒకే విధంగా ఉంది. ఇకపోతే టిసిఎస్ ప్రకటించిన 40 వేల ఉద్యోగాలు క్యాంపస్ సెలక్షన్ ద్వారా ఉంటాయని ప్రకటించింది.. గత త్రైమ్రాసికంలో సంస్థ ఆదాయం తగ్గినప్పటికీ... నియామకాలను తగ్గించుకోబోదని టీసీఎస్ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. అంతేకాదు.. అమెరికాలో కూడా క్యాంపస్ ప్లేస్‌మెంట్ పెంచాలని నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. ఈ ఏడాదిలో యూఎస్‌లో 2 వేల మందిని నియమించు కోవాలని నిర్ణయించింది. దీని మూలంగా హెచ్ 1 బీ, ఎల్ 1 వర్క్ వీసాలపై ఆధారపడటాన్ని తగ్గించు కోవచ్చని భావిస్తోంది టీసీఎస్.. ఇక, భారత్‌లో అయితే.. 40 వేల ఉద్యోగాలు లేదా 35 వేల నుంచి 45 వేల మధ్య ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. కీలకమైన వ్యాపారం కోసం కొత్త వాళ్లతో పాటు అనుభవ జ్ఞులైన నిపుణులను కూడా నియమించనున్నారు. మొత్తంగా టిసిఎస్ ను ఆదర్శంగా తీసుకుని ఇతర కంపెనీలను ప్రోత్సహించాల్సి ఉంది.

కరోనాపై సర్కార్ దిద్దుబాటు చర్యలు

మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసే అవకాశం

హైదరాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): కరోనాపై దిద్దుబాటు చర్యలకు తెలంగాణ ప్రభుత్వం నడుం బిగించింది. పెరుగుతన్న కేసులు, వస్తున్న విమర్శలతో మరింత పక్కాగా వైద్య సేవలను అందించడంతో పాటు, కఠిన చర్యలకు ఉపక్రమించింది. రెండు రోజుల క్రితం ముఖ్య అధికారులను బదిలీ చేసిన తరవాత సిఎం కెసిఆర్‌దీనిపై సమగ్రంగా చర్చించారు. కరోనా తీవ్రత ఉన్నా వైద్యం అందుతోదని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో మంత్రుల కమిటీని ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మంత్రుల కమిటీకీ ఛైర్మన్‌గా ఈటల రాజేందర్ ఉండనున్నారు. సభ్యులుగా మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల మంత్రులు కేటీఆర్, దయాకర్‌రావుతోపాటు మరో ఇద్దరు మంత్రులు ఉండనున్నట్టు సమాచారం. రెండు రోజుల్లో కరోనా కట్టడికి తీసుకోవాల్సిన పకడ్బందీ చర్యలపై నివేదిక ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు రాష్ట్రంలో కరోనా బారినపడి కోలుకుంటున్నవారి శాతం పెరుగుతున్నది. శుక్రవారం 1,410 మంది డిశ్చార్జి అయ్యారు. రాష్ట్రంలో రికవరీ రేటు 68 శాతంగా ఉన్నదని వైద్యారోగ్యశాఖ తెలిపింది. ఇప్పటివరకు 2.37 లక్షల నమూనాలను పరీక్షించామని వివరించింది. రాష్ట్రవ్యాప్తంగా 15,288 పడకలు ఖాళీగా ఉన్నట్టు ప్రకటించింది. తాజాగా శుక్రవారం 1,478 కేసులు వెలుగుచూశాయి. జీహెచ్ఎంసీలోనే 806 కేసులు నమోదైనట్టు వైద్యారోగ్యశాఖ బులెటిన్‌లో పేర్కొన్నది. రంగారెడ్డి జిల్లాలో 91, వేడ్పల్ మల్కాజిగిరిలో 82, కరీంనగర్‌లో 77, వరంగల్ అర్బన్‌లో 51, పెద్దపల్లి, నల్లగొండలో 35 చొప్పున, కామారెడ్డిలో 31, రాజన్నసిరిసిల్లలో 27, మెదక్, నాగర్‌కర్నూల్‌లో 23 చొప్పున, సూర్యాపేట, సంగారెడ్డిలో 20 చొప్పున, మహబూబ్‌నగర్‌లో 19, ఖమ్మంలో 18, వికారాబాద్‌లో 17, మంచిర్యాలలో 15, నారాయణపేటలో 14, యాదాద్రి భువనగిరి, కుమ్రంభీంఆసిఫాబాద్, నిజామాబాద్, మహబూబాబాద్‌లో 11 చొప్పున, జనగామలో 10, సిద్దిపేటలో 8, జగిత్యాలలో 4, జయశంకర్‌భూపాలపల్లి, వనపర్తి, జోగులాంబ గద్వాలలో 2 చొప్పున, భద్రాద్రికొత్తగూడెం, ములుగు జిల్లాల్లో 1 కేసు చొప్పున వెలుగుచూశాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 42,496కు చేరింది. వైరస్‌తోపాటు ఇతర అనారోగ్య కారణాలతో ఏడుగురు మృతిచెందారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 403కు పెరిగింది.

ఆందోళనకరంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ

మరోమారు షట్‌డౌన్ తప్పదన్న సంకేతాలు

వాషింగ్టన్,జూలై18(ఆర్ఎన్ఎ): అమెరికాలో పెరుగుతున్న కరోనా కేసులు ఆ దేశ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు ఆటంకంగా మారే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) హెచ్చరించింది. ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరిచేందుకు అమెరికా అనేక చర్యలు చేపట్టినప్పటికీ.. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమ్రాసికంలో స్థూల జాతీయోత్పత్తి 37 శాతం తగ్గిందని ఐఎంఎఫ్ గుర్తుచేసింది. కరోనా బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండడంతో మరోసారి షట్‌డౌన్ తప్పకపోవచ్చునని పేర్కొంది. రాబోయే కాలంలో డిమాండ్‌ను పెంచేలా ప్రజలకు ప్రభత్వం మరింత చేయూతన ందించాల్సిన అవసరం ఉంటుందని తెలిపింది. అలాగే క్రమంగా విస్తరిస్తున్న పేదరికం, ఆరోగ్య వ్యవస్థలో ఉన్న లోపాలు వంటి సమస్యల్ని అధిగమించేందకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని శుక్రవారం విడుదల చేసిన ఓ నివేదికలో సూచించింది. స్థూలంగా ఈ ఏడాది ఆర్థిక వృద్ధి 6.6 శాతం కుచించుకుపోయే అవకాశం ఉందని అంచనా వేసింది. ఫ్లోరిడా, జార్జియా, టెక్సాస్, కాలిఫోర్నియా వంటి రాష్ట్రాల్లో స్థానికంగా ఇప్పటికే మరోసారి ఆంక్షల్ని విధించిన విషయాన్ని ఐఎంఎఫ్ గుర్తుచేసింది. తాజా పరిస్థితులు హిస్పానిక్, నల్లజాతీయుల వంటి అల్పాదాయ వర్గాల జీవనంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించింది. వివిధ రంగాల్లో ఇప్పటికే నమోదవుతున్న నష్టాలు పెరుగుతున్న పేదరికాన్ని సూచిస్తున్నాయని తెలిపింది. రాబోయే కొన్ని నెలల్లో అమెరికా మరో దఫా ఉద్దీపన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఐఎంఎఫ్ సూచించింది. డిమాండ్‌కు ఊతమిచ్చేలా, ఆరోగ్య వ్యవస్థ అప్రమత్తతను మెరుగుపరిచేలా, అట్టడుగు వర్గాలకు దన్నుగా నిలిచేలా ఉద్దీపన కార్యక్రమాలు ఉండాలని సూచించింది. ఇప్పటికీ ఆర్థికపరమైన వెసులుబాట్లు ఉన్న కారణంగా వీలైనంత త్వరగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలిపింది. అలాగే ఈ సంక్షోభాన్ని సామాజిక భద్రత వంటి శాశ్వత పరిష్కారాలను చూపేందుకు అవకాశంగా మలచుకోవాలని హితవు పలికింది.

తిరుమల దర్శనాలను నిలిపివేయండి

ప్రభుత్వానికి రమణ దీక్షితులు వినతి

తిరుమల,జూలై18(ఆర్ఎన్ఎ): తిరుమలలో కరోనా కేసులు పెరుగుతుండటంతో శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనాలను నిలిపివేయాలని ఆలయ గౌరవ ప్రధాన అర్చకులు ఏవీ రమణ దీక్షితులు కోరారు. ఈమేరకు ఆయన ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ మోహన్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ట్విటర్ ద్వారా విజ్ఞప్తి చేశారు. శ్రీవారి ఆలయంలో పనిచేసే అర్చకుల స్థానంలో వేరొకరిని తీసుకురావడం లేమని, వేంకటేశ్వరుని నిత్య ఆరాధనలు ఆపితే మానవ జాతికి మంచిది కాదని పేర్కొన్నారు. అందువల్ల కొన్నివారాల పాటు స్వామివారికి దర్శనాలను ఆపాలని సూచించారు. శ్రీవారికి జరిగే నిత్యపూజలను ఏకాంతంగా చేయడం వల్ల అర్చకుల ప్రాణాలను కాపాడినవారమవుతామని తెలిపారు. దేవస్థానంలో పనిచేస్తున్న మొత్తం 50 మంది అర్చకుల్లో 15 మందికి కరోనా పాజిటివ్ వచ్చిందని, వారంతా క్వారంటైన్‌లో ఉన్నారని రమణ దీక్షితులు శుక్రవారం ట్వీట్ చేశారు. మరో 25 మంది పరీక్షలు నిర్వహించారని, ఇంకా ఫలితాలు రాలేదని తెలిపారు. ఆలయంలో కరోనా కేసులు పెరుగుతుండటంతో దర్శనాలను నిలిపివేయాలని ఆయన కోరారు. అయితే టీటీడీ ఈఓ, ఏఈఓ దాన్ని తిరస్కరించారని వెల్లడించారు. ఇది ఇలాగే కొనసాగితే పరిస్థితి మరింత క్షీణిస్తుందని, తగిన చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరోనా వైరస్ తిరుమలలో రోజురోజుకు విజృంభిస్తోంది. వైరస్ బారిన పడిన వారి సంఖ్య పెరుగుతోంది. తాజాగా శ్రీవారి ఆలయ జీయర్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 170 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. 18 మంది అర్చకులు, 100 మంది సెక్యూరిటీ సిబ్బంది కరోనా బారిన పడ్డారు. 20 మంది పోటు సిబ్బంది, కల్యాణకట్టలో ఇద్దరికి కరోనా సోకినట్లు అధికారులు పేర్కొన్నారు. 60 ఏళ్లు నిండిన అర్చకులకి విధుల నుంచి సడలింపు ఇచ్చామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. అర్చకులకి ప్రమాదకరమైన పరిస్థితి నెలకొంటే దర్శనాలు కూడా ఆపివేస్తామని కూడా ఆయన పేర్కొన్నారు. అర్చకులు బాగుంటేనే శ్రీవారి కైంకర్యాలు సక్రమంగా జరుగుతాయని, దర్శనాల సంఖ్య తగ్గించడం, పెంచడం ఉండదని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్న సంగతి తెలిసిందే.

కరోనాతో చితికిపోయిన వారికి ఆర్థిక సాయం

-సంగారెడ్డిలో చెక్కులు అందచేసిన మంత్రి హరీష్

సంగారెడ్డి,జూలై18(ఆర్ఎన్ఎ): కరోనా కష్టకాలంలో ఆర్థికంగా చితికి పోయి ఇబ్బందుల్లో ఉన్న వీధి వ్యాపారులకు సూక్ష్మ రుణ సదుపాయం కల్పించి భరోసా కల్పిస్తున్నామని ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టణ వీధి విక్రయ వ్యాపారుల రుణ మేళ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. మంజూరు ఉత్తర్వుల

హోంక్వారంటైన్‌లో హుస్నాబాద్ ఎమ్మెల్యే

కరీంనగర్,జూలై18(ఆర్ఎన్ఎ): హుస్నాబాద్ ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్ హోంక్వారంటైన్‌లో ఉన్నారు. ఇటీవల ఎమ్మెల్యే వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోగా, శుక్రవారం ఫలితాల్లో పాజిటివ్‌గా తేలినట్టు సమాచారం. దీంతో ఆయన హోంక్వారంటైన్‌లో ఉన్నట్టు తెలిసింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన ఓ వైద్యుడు కరోనా చికిత్సపొందుతూ గాంధీ దవాఖానలో శుక్రవారం మృతిచెందారు. ఆయనకు కిడ్నీ, కాలేయ, గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయి.

జర్నలిస్ట్ ఇంటిపై పోలీసుల దాడి

గుండెపోటుతో తండ్రి మృతి

గువాహటి,జూలై18(ఆర్ఎన్ఎ): పోలీసులు అర్ధరాత్రి ఓ జర్నలిస్టు ఇంటిపై దాడి చేసి అరెస్టు చేయడంతో, జర్నలిస్టు తండ్రి గుండెపోటుతో మరణించిన ఘటన అసోం రాష్ట్రంలోని ధూబ్రీ నగరంలో సంచలనం రేపింది. ధూబ్రీ నగర ప్రెస్ క్లబ్ ప్రధానకార్యదర్శి రాజీవ్ శర్మ వర్ణాకులర్ న్యూస్ చానల్ కు ప్రాంతీయ విలేఖరిగా పనిచేస్తున్నాడు. రాజీవ్ శర్మ తన తండ్రి సుధీన్ శర్మ (64)తో కలిసి ఉంటున్నారు. ఓ కేసులో నిందితుడిగా జర్నలిస్టు రాజీవ్ శర్మ పేరు చేర్చి అతని ఇంటిపై తెల్లవారుజామున రెండుగంటలకు అసోం పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు. ఈ ఘటనతో తల్లడిల్లిన రాజీవ్ శర్మ తండ్రి సుధీన్ శర్మ గుండెపోటుతో మరణించారు. దీంతో రాజీవ్ శర్మకు ఇంటీరియం బెయిలు మంజూరు చేశారు. రాజీవ్ శర్మ ఇటీవల పశువుల స్మగ్లింగ్ కుంభకోణంపై వరుస కథనాలు ఇచ్చారు. రాజీవ్ శర్మ తన తండ్రి అంత్యక్రియలు జరిపారు. జర్నలిస్టును అర్ధరాత్రి అరెస్టు చేసి, అతని తండ్రి చావుకు కారణమైన ఘటనపై అసోం రాష్ట్ర ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్ జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని గువాహటి ప్రెస్ క్లబ్ డిమాండు చేసింది. జర్నలిస్టు కేసును రాష్ట్ర క్రైం డిపార్టుమెంటుకు బదిలీ చేయనున్నారు. జర్నలిస్టు అరెస్టు వ్యవహారంలో ధూబ్రీ పోలీసు చీఫ్ ను బదిలీ చేశారు.

ఆవుమూత్రంతో రోగనిరోధక శక్తి

-బిజెపి బెంగాల్ అధ్యక్షుడు దిలీప్ ఘోష్

కోల్‌కతా,జూలై18(ఆర్ఎన్ఎ): కరోనా కు వ్యాక్సిన్ కనిపెట్టడానికై ప్రపంచదేశాలు కుస్తీ పడుతున్నాయి. పేరు మోసిన శాస్త్రవేత్తలు సైతం ఇప్పటివరకు వ్యాక్సిన్ కనిపెట్టలేకపోయారు. ప్రజా ప్రతినిధులు మాత్రం కరోనాకు తమకు తోచిన సలహాలు ఇస్తున్నారు. పశ్చిమబెంగాల్ బీజేపీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ ఈ వ్యాఖ్యలు చేసాడు. కొవిడ్-19కు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో రోగనిరోధక శక్తని పెంచడానికి గోమూత్రం తాగాలని దిలీప్ ఘోష్ సూచించాడు. దుర్గాపూర్ నగరంలో జరిగిన సమావేశంలో దిలీప్ ఘోష్ మాట్లాడుతూ... నేను ఆవుల గురించి మాట్లాడితే చాలా మందికి అసౌకర్యంగా అనిపిస్తుంది. ఆవు విలువను గాడిదలు ఎప్పటికీ అర్థం చేసుకోవు. ఇది భారతదేశం, శ్రీకృష్ణుడు జన్మించిన భూమి ... ఇక్కడ మేం ఆవులను పూజిస్తాం. ఆరోగ్యంగా ఉండటానికి మాకు ఆవు మూత్రం ఉంది. మద్యం తాగే వారు, ఆవు విలువను ఎలా అర్థం చేసుకుంటారు' అంటూ ఘాటుగా స్పందించాడు. ఈయన గతంలో కూడా ఆవు పాలలో బంగారం ఉందని వ్యాఖ్యానించడం విమర్శలకు దారి తీసింది. ఇక ఇప్పుడు ఆవు మూత్రంతో కరోనా కు చెక్ పెట్టవచ్చని మరోసారి విమర్శల పాలవుతున్నారు.

మెడికల్ కాలేజీల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎంతో చెప్పగలరా?

-మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు టీడీఎఫ్ ప్రశ్న

హైదరాబాద్,జూలై17(ఆర్ఎన్ఎ): మాటిమాటికి కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తెచ్చినం అంటున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీరుపై తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ కన్వీనర్ డాక్టర్ పీఎస్ విజయేందర్ అసహనం వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీ అంటే బిల్డింగులు కాదు. ఎంత మంది ఫ్యాకల్టీ, నర్సులు, సహాయక సిబ్బంది ఉన్నారనన్నది ముఖ్యమని అన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎంత ఉన్నది అనేదే ముఖ్యమని టీఆర్ఎస్ మంత్రులనుద్దేశించి తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ కన్వీనర్ డాక్టర్ పీఎస్ విజయేందర్ అన్నారు. మెడికల్ కాలేజీ కు అవసరమైన నిబంధనల గురించి మంత్రి శ్రీనివాస్ గౌడ్ బాగా మాట్లాడారన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఉస్మానియా మెడికల్ కాలేజీ నుండి ఎర్రగడ్డలో వున్న ఛాతీ ఆసుపత్రి, మానసిక రోగుల ఆసుపత్రి ఎంత దూరంలో వున్నాయని అడిగారు. వాటికి లేని నిబంధనలు ఉస్మానియా ఆసుపత్రికేనా అని ప్రశ్నించారు. మహబూబ్ నగర్ మెడికల్ కాలేజీలోని ప్రతి డిపార్టుమెంట్‌లో ఎంత మంది ఫ్యాకల్టీ వుండాలి, ఎంత మంది వున్నారు? దీని మీద మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడగలరా?' అని అన్నారు. డిప్యూటేషన్ల మీద అక్కడ వున్న సిబ్బందిని ఇక్కడ, ఇక్కడ వున్న సిబ్బంది అక్కడ వేస్తున్నారు. కాని అసలు శాశ్వత ప్రాతిపదికన ఖాళీగా ఉన్న పోస్టులను రిక్రూట్మెంట్ ఎన్ని చేశారు, ఎందుకు చేస్త లేరని ప్రశ్నించారు. మీ సొంత జిల్లా అయిన మహబూబ్ నగర్ జిల్లా ఆసుపత్రి నుండి ఉస్మానియా ఆసుపత్రికి రోగులను ఇంకా ఎందుకు పంపిస్తున్నారు? మీ ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యం మీద వున్న చిత్త శుద్ధి ఏమిటి?' అని మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను విజయేందర్ ప్రశ్నించారు.

కేరళ బంగారం కేసులో మరో మలుపు

-యూఏఈ దౌత్య అధికారి రషీద్ ఖామిస్ గన్‌మెన్ అదృశ్యం

తిరువనంతపురం,జూలై18(ఆర్ఎన్ఎ): కేరళకు సంబంధించిన బంగారం అక్రమ రవాణా కేసులో మరో మలుపు చోటుచేసుకున్నది. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లుగా అనుమానిస్తున్న యూఏఈ దౌత్య అధికారి రషీద్ ఖామిస్ గన్‌మెన్ జయఘోష్ అదృశ్యమయ్యాడు. జయఘోష్ గత రెండు రోజులుగా కనిపించడం లేదని అతని కుటుంబసభ్యులు చెప్పారు. అయితే కనిపించకుండా పోవడానికి ముందు ఆయన తన సర్వీస్ పిస్తోల్‌ను సరెండర్ చేశాడని జయఘోస్ బావ తెలిపారు. జూలై 5న తిరువనంతపురం విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు బంగారాన్ని సీజ్ చేయగానే కేసులో రెండో నిందితురాలిగా ఉన్న స్వప్న సురేష్ పలుమార్లు జయఘోష్‌కు ఫోన్ చేసిందని కుటుంబసభ్యులు చెబుతున్నారు. బంగారం స్మగ్లింగ్‌కు సంబంధించి జయఘోషే కస్టమ్స్ అధికారులకు సమాచారం ఇచ్చాడనే అనుమానంతో నిందితులు అతడిని బెదిరిస్తున్నారని తెలిపారు. వారి నుంచి జయఘోష్‌కు ప్రాణాపాయం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు.

జూలై 5న తిరువనంతపురం విమానాశ్రయంలో సందీప్ నాయర్ అనే వ్యక్తి నుంచి 14.82 కోట్ల విలువచేసే 30 కేజీల అక్రమ బంగారాన్ని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి ఈ కేసులో స్వప్న సురేష్ అనే మహిళతో పాటు మరో ముగ్గురికి సంబంధం ఉన్నట్లు గుర్తించారు. అయితే, ఆ బంగారం పార్సిల్‌పై యూఏఈ దౌత్య అధికారి రషీద్ ఖామిస్ పేరు ఉండటంతో.. కస్టమ్స్ తనిఖీల నుంచి తప్పించుకోవడం కోసం నిందితులు పక్కా ప్లాన్ చేసి ఉంటారని అధికారులు భావిస్తున్నారు.

సుశాంత్ మరణపై సిబిఐ విచారణ అనవసరం

-ముంబై పోలీసులు కేసు తేల్చేస్తారన్న హోంమంత్రి

ముంబై,జూలై18(ఆర్ఎన్ఎ): బాలీవుడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ బలవన్మరణం చెందినప్పటికీ ఆయన మృతిపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. నట వారసత్వం వలన అని కొందరు అంటుంటే వృత్తి పరంగా నెలకొన్న వివాదాలు లేదంటే ప్రేమ వలన మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇటీవల సుశాంత్ గార్ల్ ఫ్రెండ్ రియా చక్రవర్తి కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఆమె ట్విట్టర్ ద్వారా ఓ విన్నపం చేసింది. తాను సుశాంత్‌సింగ్ గర్ల్‌ఫ్రెండ్‌నంట పేర్కొంటూ.. న్యాయవ్యవస్థ మీద విశ్వాసంతో ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతున్నా. సుశాంత్ ఆత్మహత్యకు కారణాలేమిటి? ఎలాంటి ఒత్తిళ్ల కారణంగా అతను దారుణమైన నిర్ణయాన్ని తీసుకోవాల్సి వచ్చింది? అనే విషయాలపై లోతుగా పరిశోధించాలని కోరుతున్నా' అని పేర్కొంది.రియా విన్నపంకి సంబంధించి మహారాష్ట్ర హోంమంత్రి అనిల్ దేశ్ ముఖ్ స్పందించారు. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణ కేసును ముంబై పోలీసులు చేధించగలరని, ఈ కేసును సీబీఐకి అప్పగించాల్సిన అవసరం లేదని అనిల్ దేశ్ ముఖ్ తెలిపారు. మా పోలీసు అధికారులు సమర్థులు .విచారణను సరైన మార్గంలో చేస్తున్నారు. మేము కూడా వ్యాపారంకి సంబంధించి ఏమైన శతృత్వం ఉందా అనే కోణంలో పరిశీలిస్తున్నాము అని అన్నారు. కాగా గత నెలలో ముంబైలోని తన అపార్ట్‌మెంట్‌లో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య చేసుకుని చనిపోయాడని పోలీసులు ధృవీకరించారు.

రైతు వేదికల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకర్ నాయక్ శంకుస్థాపన

మహబూబాబాద్ మండలంలో రైతు వేదికల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్

మహబూబాబాద్ , జులై 18: జిల్లాలోని మహబూబాబాద్ మండలం కంబలపల్లి, అమనగల్, జంగిలిగొండ గ్రామాలలో రైతు వేదికల నిర్మాణానికి ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ నేడు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతును రాజు చేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ అనేక విధాలుగా కృషి చేస్తున్నారన్నారు. దానిలో భాగంగానే ఈ రైతు వేదికల నిర్మాణం అన్నారు. కరోన వైరస్ వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్వీయ నియంత్రణతో పాటు భౌతికదూరాన్ని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, సర్పంచ్ లు, ఎంపిటిసిలు, గ్రామ రైతు కో ఆర్డినెటర్ లు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎపిలో ఆందోళనకరంగా కరోనా వ్యాప్తి

మొత్తం 40వేలకు పైగా కరోనా కేసులు

శ్రీకాళహస్తి ఎమ్మెల్యేకు కరోనా

చిత్తూరు,జూలై18(ఆర్ఎన్ఎ): ఏపీలో కరోనా కేసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. సాధారణ ప్రజలతో పాటు అధికారులు ప్రజా ప్రతినిధులు సైతం కరోనా బారిన పడటం ఆందోళన కలిగిస్తోంది. కరోనాను అదుపు చేయడానికి ఇప్పటికే ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుంది. అయిన్పటికీ కేసుల సంఖ్య తగ్గడంలేదు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు కరోనాతో ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. కాగా తాజాగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కరోనా అనుమానంతో ఆయన టెస్ట్ చేసుకోగా పాజిటివ్ గా నిర్ధారణ అయ్యింది. ఇక ఆయనతో పాటు ఆయన సతీమణి కూడా కరోనా బారిన పడ్డారు. ఎమ్మెల్యేకు కరోనా పాజిటివ్ రావటంతో ఆయనను కలిసిన కార్యకర్తలు, సన్నిహితుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం అధికారులు ఎమ్మెల్యేను కలిసిన వారిని ట్రేస్ చేసే పనిలో పడ్డారు. మరోవైపు ఏపీలో ఇప్పటివరకు మొత్తం 40వేలకు పైగా కరోనా కేసులు నమోదయ్యాయి. శుక్రవారం ఒక్కరోజే రాష్ట్రంలో 2,602 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాకు కూడా కరోనా పాజిటివ్ నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. ఇకపోతే రాష్ట్రంలో కరోనా బీభత్సం సృష్టిస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో 2,602 కేసులు నమోదయ్యాయి. ఇందులో 2,592మంది రాష్ట్రంలోని వారు కాగా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 8మందికి, విదేశాల నుంచి వచ్చిన ఇద్దరికి వైరస్ సోకింది. వీటితో కలిపి మొత్తం పాజిటివ్‌లు 40,646కు చేరాయి. ఇప్పటివరకూ మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీ, కర్ణాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రమే 40వేలకు పైగా కేసులు నమోద య్యాయి. ఇప్పుడు ఆ జాబితాలో ఏపీ కూడా చేరింది. రాష్ట్రంలో కరోనా మరణాలు 534కు చేరాయి. తిరుపతిలోని కొవిడ్ ఆస్పత్రిలో కరోనా చికిత్స పొందుతూ కడప జిల్లాకు చెందిన ఇద్దరు విలేకరులు మృతిచెందారు. కర్నూలు జిల్లా శ్రీశైలంకు చెందిన మరో ఎమ్మెల్యేకి కరోనా సోకింది. కొద్దిరోజులు అస్వస్థతకు గురైన ఆయన 13న పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో సహా నియోజకవర్గంలోని తన స్వగృహంలోనే హోం ఐసోలేషన్‌లోకి వెళ్లారు. గురువారం రాత్రి ఆయనకు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కర్నూలు జిల్లాలో మరో 315మంది కొవిడ్ బారిన పడ్డారు. దీంతో జిల్లాలో మొత్తం కేసుల సంఖ్య 5,131కి చేరింది. తూర్పుగోదావరి జిల్లాలో మరో 608 కేసులు నమోదయ్యాయి. జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే పీఏకు వైరస్ సోకింది. చిత్తూరు జిల్లాలో మరో 496 కేసులను యంత్రాంగం గుర్తించింది. అనంతపురంలో 297, గుంటూరులో 226, నెల్లూరులో 205, శ్రీకాకుళంలో 166, కడపలో 51, కృష్ణాజిల్లాలో 37 చొప్పున కొత్త కేసులు నమోదయ్యాయి. అసెంబ్లీ రిపోర్టింగ్ విభాగంలో విధులు నిర్వర్తించే ఆరుగురికి, మార్షల్ విధులు నిర్వర్తించే పోలీస్ కానిస్టేబుల్‌కు శుక్రవారం పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో అసెంబ్లీ(10), సచివాలయం(41)లో కలిపి మొత్తం కేసుల సంఖ్య 51కి చేరింది. ఏపీసీఆర్డీయే ప్రధాన కార్యాలయంలో ఓ అటెండర్ కరోనాతో మృతి చెందారు. విజయవాడలోని కొవిడ్ చికిత్సా కేంద్రంలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి ఆయన ప్రాణాలు కోల్పోయారు. కాగా, సీఆర్డీయే, ఏడీసీ అధికారులు, ఉద్యోగులకు ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో శుక్రవారం మరో అయిదారుగురికి కొవిడ్ సోకినట్లు తేలిందని సమాచారం. గుంటూరు జిల్లాలో ఓ ఉన్నతాధికారి కుటుంబం కరోనా బారిన పడింది. అధికారితో పాటు ఆయన నతీమణి, కుమారుడికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా తేలింది. ఆ మొత్తం కుటుంబాన్ని ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వారంరోజులుగా ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లాలో వైరస్ నివారణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పుడు ఆయనకు పాజిటివ్ రావడంతో మిగతా అధికారులు కూడా పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉద్దానం కిడ్నీ బాధితులకు పెద్ద ఊరట

700 కోట్లతో శాశ్వత మంచినీటి ప్రాజెక్ట్

టెండర్ దక్కించుకున్న మేఘా ఇంజనీరింగ్ సంస్థ

శ్రీకాకుళం,జూలై18(ఆర్ఎన్ఎ): ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ రోగులకు ఎన్నాళ్ల నుంచో వేధిస్తున్న మంచినీటి సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపే దిశగా నడుం బిగించింది. ఈ మేరకు రూ.700 కోట్లతో ఉద్దానంలో ప్రతి ఇంటికి మంచినీటిని అందించేలా ప్రత్యేక ప్రాజెక్టును నిర్మించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఇప్పటికే దీనికి ఆమోదం ఇచ్చారు. ఉద్దానం మంచినీటి ప్రాజెక్టును 'మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. ప్రతిష్టాత్మకమైన ఉద్దానం ప్రాంతంలో శాశ్వత మంచినీటి పథకం నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిధుల మంజూరు, పనులకు చెందిన పరిపాలన ఆమోదాన్ని కూడా ప్రకటించింది. ఈ క్రమంలో ఇటీవలే నిర్వహించిన టెండర్లను ప్రముఖ నిర్మాణ సంస్థ 'మేఘా' దక్కించుకుంది. పనులు పూర్తయితే ఉద్దాన ప్రాంతంలో ఉన్న మొత్తం ఏడు మండలాల్లో 807 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందనుంది. ఏపీ తాగునీటి సరఫరా సంస్థ ఆధ్వర్యంలో ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఉద్దాన ప్రాంత పరిధిలో 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం తాజా ప్రాజెక్టు ద్వారా మొత్తం ఏడు మండలాల్లోని 807 గ్రామాల్లోని సుమారుగా 4,69,157 మందికి ప్రస్తుతానికి మంచినీటి అవసరాలు తీరనున్నాయి. ఏడు మండలాలతో పాటు పలాస?కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మున్సిపాల్టీ ల్లోనూ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ ప్రాజెక్టును మొదట్లో రేగులపాడు వద్ద ఉన్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నుంచి ప్రధాన నీటి వనరుగా గుర్తించినప్పటికీ సాంకేతిక కారణాలతో తాజాగా హిరమండలం బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టును ఖరారు చేశారు. ఈ సోర్స్ సెంటర్ నుంచి సుమారు 19.2 టీఎంసీల నీటిని వినియోగించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. దీంతో ఉద్దాన ప్రాంతంలోని ఇచ్ఛాపురం మండలంలో 45 గ్రామాలు, కంచిలిలో 138, కవిటిలో 118, సోంపేటలో 74, మందసలో 225, పలాస లో 86, వజ్రపుకొత్తూరులో 121 గ్రామాలకు మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కిడ్నీ సంబంధిత రోగాలతో ఉద్దాన ప్రాంత ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్న సంగతి విదితమే. వీరికి పూర్తి స్థాయిలో ఆరోగ్య పరిస్థితులు మెరుగయ్యేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. అయితే భవిష్యత్ అవసరాల దృష్ట్యా 2051 నాటికి ఇదే ప్రాంతంలో సుమారు 7,82,707 మంది జనాభాకు ఈ ప్రాజెక్టు ద్వారా మంచినీటిని వినియోగించుకునేలా డిజైన్ చేశారు. ఈ మేరకు మేఘా సంస్థ త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించనుంది.

తిరుమల శ్రీవారి ఆలయంలో కరోనా కలకలం

కరోనా బారిన పడ్డ పెద్దజీయంగారు

ఆలయ దర్శనాల నిలిపవేతపై ఛైర్మన్ సమీక్ష

తిరుమల,జూలై18(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారి ఆలయాన్ని కరోనా వైరస్ కుదిపేస్తున్నది. ఇప్పటికే టీటీడీకి చెందిన 15 మందికిపైగా అర్చకులు కరోనా బారినపడ్డారు. తాజాగా శ్రీవారి ఆలయ పెద్దజీయర్ స్వామికి కరోనా నిర్ధారణ అయ్యింది. దీంతో టీటీడీ అధికారులు స్వామీజీని తిరుపతిలోని పద్మావతి క్వారంటైన్‌కు తరలించారు. తిరుమలలో కరోనా కేసులు పెరుగుతుం డటంతో శ్రీవారి దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేసే అంశాన్ని దేవస్థాన అధికారులు పరిశీలిస్తున్నారు. కరోనా కేసులు క్రమంగా పెరుగుతుండటంతో మార్చి 20న తిరుమల దేవస్థానాన్ని మూసివేశారు. భక్తుల దర్శనాలను నిలిపివేసి, స్వామివారి నిత్య కైంకర్యాలను కొనసాగించారు. అయితే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ నిబంధనలను సడలించడంతో సుమారు 80 రోజుల తర్వాత.. జూన్ 11న శ్రీవారి ఆలయాన్ని తెరిచారు. అప్పటి నుంచి భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. అయితే ఆలయంలో పనిచేస్తున్న 15 మంది అర్చకులతో సహా 140 మందికి కరోనా సోకింది. ఇందులో టీటీడీ ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది, ప్రసాదాలు తయారు సిబ్బంది ఉన్నారు. మొత్తం 50 మంది అర్చకులకు కరోనా పరీక్షలు నిర్వహించగా, 15 మందికి నిర్ధారణ అయ్యింది. మరో 25 మందికి సంబంధించిన ఫలితాలు ఇంకా వెల్లడికాలేదు. మొత్తంగాకరోనా వైరస్ తిరుమలలో రోజురోజుకు విజృంభిస్తోంది. వైరస్ బారిన పడిన వారి సంఖ్య పెరుగుతోంది. తాజాగా శ్రీవారి ఆలయ జీయర్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు అధికారులు తెలపడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ఇప్పటివరకు 170 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. 18 మంది అర్చకులు, 100 మంది సెక్యూరిటీ సిబ్బంది కరోనా బారిన పడ్డారు. 20 మంది పోటు సిబ్బంది, కల్యాణకట్టలో ఇద్దరికి కరోనా సోకినట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా, తిరుమలలో పరిస్థితులపై టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సమీక్ష నిర్వహించారు. టీటీడీ ఈవో, అదనపు ఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. శ్రీవారి దర్శనాల నిలిపివేతపై నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. కరోనా వైరస్ సోకిన జీయర్ స్వాములు, అర్చకులతో పాటు ఇక మిగిలిన టీటీడీ సిబ్బందికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మరోవైపు తిరుమలలో కరోనా కేసులు పెరుగుతుండటంతో శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనాలను నిలిపివేయాలని ఆలయ గౌరవ ప్రధాన అర్చకులు ఏవీ రమణ దీక్షితులు కోరారు. ఈమేరకు ఆయన ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ మోహన్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ట్విటర్ ద్వారా విజ్ఞప్తి చేశారు. శ్రీవారి ఆలయంలో పనిచేసే అర్చకుల స్థానంలో వేరొకరిని తీసుకురాలేమని, వేంకటేశ్వరుని నిత్య ఆరాధనలు ఆపితే మానవ జాతికి మంచిది కాదని పేర్కొన్నారు. అందువల్ల కొన్నివారాల పాటు స్వామివారికి దర్శనాలను ఆపాలని సూచించారు.

జగిత్యాల జిల్లా ధర్మపురి ఎంపీడీవో కార్యాలయంలో 44 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను అందచేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్

నెక్లెస్‌రోడ్డులో నీరా కేఫ్ ఏర్పాటు

-23న శంకుస్థాపన చేస్తామన్న మంత్రి గౌడ్

హైదరాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ గౌడ వృత్తి దారుల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా నీరా పాలసీని ప్రవేశ పెట్టారని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అందులో భాగంగానే దేశంలోనే అత్యంత ఆధునికంగా నీరా కేఫ్ నిర్మాణానికి నెక్లెస్‌రోడ్‌లో ఈనెల 23న శంకుస్థాపన చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. రూ.3కోట్లతో దీనిని నిర్మిస్తున్నామని చెప్పారు. ఈసందదర్భంగా శుక్రవారం గౌడ సామాజిక ప్రతినిధులు, గౌడ్ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆధునిక నీరా కేఫ్ ప్రతిపాదిత నమూనాను మంత్రి పరిశీలించారు. అనంతరం ప్రతిపాదిత

నమూనాపై సమావేశానికి హాజరైన ప్రతినిధులతో చర్చించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఆధునిక పద్ధతిలో నీరా స్టాల్‌ను ఏర్పాటుచేస్తున్నామన్నారు.

నీరా ఉత్పత్తి చేయడానికి గీత వృత్తిదారులకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అన్ని వృత్తుల ఆత్మగౌరవం కోసం ప్రభుత్వం వేల కోట్ల విలువైన భూములను కేటాయించిందన్నారు. గీత వృత్తికి పూర్వవైభవం తీసుకు రావడానికి ప్రతిష్టాత్మకంగా నీరా పాలసీని ప్రవేశపెట్టి గీత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తెలిపారు. రాష్ట్రంలో ప్రతి గౌడ కులస్తుడు కనీసం మూడు ఈత, తాటి , గిరుకతాళ్లు (డాలర్ ట్రీ)లను నాటి గీత వృత్తిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ,్ ÷నాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రాజేశంగౌడ్, రాష్ట్రగౌడ సంఘం అధ్యక్షులు ప్లలె లక్ష్మణ్‌గౌడ్, గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, పర్యాటకశాఖ ఎండి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కరోనాతో కలెక్టరేట్ ఉద్యోగి మృతి

ఆందోళనలో తోటి ఉద్యోగులు

కామారెడ్డి జిల్లాలోనూ ఉద్యోగుల్లో కలకలం

నిజామాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): కరోనావైరస్ సోకిన అటెండర్ మృతిచెందడంతో.. నిజామాబాద్ కలెక్టరేట్‌లో అలజడి మొదలైంది.. కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని డీఆర్‌వో కార్యాలయంలో విధులు నిర్వహించే అటెండర్‌కు మూడు రోజుల క్రితం కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది.. ఆ తర్వాత ఆస్పత్రికి తరలించారు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతో అటెండర్ మృతిచెందాడు. దీంతో.. కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.. అటెండర్ అంటే.. అన్ని విభాగాలు తిరిగే అవకాశం ఉంటుంది.. దీంతో.. కలెక్టరేట్‌లోని మొత్తం ఉద్యోగులు, సిబ్బందికి కరోనా భయం పట్టుకుందని చెబుతున్నారు.. ఇక, అతడితో క్లోజ్‌గా ఉండేవాళ్లు, టచ్‌లో ఉండేవాళ్లపై ఆరా తీస్తున్నారు అధికారులు. కలెక్టరేట్‌లో పలువురికి కరోనా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదిలావుంటే కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయ

మండే సూరీడు నెల్సన్ మండేలా

(18 జూలై అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం సందర్భంగా)

దక్షిణ ఆఫ్రికా జాతివివక్ష వ్యతిరేక పోరాట యోధుడు, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రేస్(ఏయన్‌సి) నాయకుడు, దానశీలి మరియు దక్షిణ ఆఫ్రికా ప్రజాస్వామ్యయుత ప్రభుత్వానికి (1994-1999) ప్రథమ నల్లజాతి అధ్యక్షుడుగా ఎన్నికైన నెల్సన్ రోలిహ్లాహ్లా (అనగా "దుడుకు స్వభావి") మండేలా పుట్టిన రోజు (18 జూలై 1918) సందర్భంగా 2009లో ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రకారం 18 జూలై 2010 రోజున "అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం" పాటించడం ప్రారంభించారు. దక్షిణాఫ్రికా మ్వెజో ప్రాంతంలోని 'తెంబూ' రాయల్ కుటుంబంలో జన్మించిన మండేలాకు తల్లితండ్రులు (నన్‌ఖాఫీ నొసెకెని మరియు కోసి ఫకన్యిస్వ గడ్లా మండేలా) పెట్టిన పేరు రోలిహ్లాహ్లా కాగా, పాఠశాలలో చేరిన పిదప ఉపాధ్యాయుడు నెల్సన్ అనే పేరుతో పిలవడం జరిగింది. పోర్ట్ హేర్, దక్షిణాఫ్రికా మరియు విట్‌వాటర్స్రాండ్ విశ్వవిద్యాలయాలలో 'బిఏ' మరియు 'లా' పట్టాలను పొందిన పిదప జొహనెస్‌బర్గ్ కోర్టులో లాయర్‌గా పనిచేశారు. ఇక్కడే 1943లో వర్ణవివక్ష వ్యతిరేక బీజాలు పడి, ఏయన్‌సి పార్టీలో చేరి శ్వేతజాతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతి వివక్ష పోరాటం ప్రారంభించారు. 1944లో ఎవెలిన్ మాసేను వివాహమాడి ఇద్దరు కొడుకులు మరియు ఇద్దరు కూతుర్లను కన్న పిదప భార్యకు విడాకులిచ్చారు. అనంతరం 'విన్నీ మడికిజేలా'ను రెండవ వివాహం చేసుకొని ఇద్దరు కూతుర్లకు జన్మనిచ్చారు. ఆమెకు కూడా విడాకులిచ్చారు. వర్ణ వివక్ష పోరాటంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలిచిన క్రమంలో అరెస్ట్ అయినారు. ఇదే క్రమంలో మార్క్సిజం వైపు ఆకర్షితులై నిషేధించబడిన దక్షిణ ఆఫ్రికా కమ్యునిస్ట్ పార్టీలో చేరి రహస్యంగా ఉద్యమాలలో పాల్గొన్నారు. శాంతియుతంగా పోరాటం చేస్తూ, 'ఉమ్మోంటో వీ స్విజ్వే' అనబడే తీవ్రవాద సంస్థను స్థాపించారు. ప్రభుత్వ యంత్రాంగం 5 డిసెంబర్ 1956 రోజున మండేలాను అరెస్టు చేసిన తరువాత 'రివోనియా విచారణ' ఫలితంగా 12 జూన్ 1963న యావజ్జీవశిక్ష విధించారు.

'రోబెన్' అనే ద్వీపంలో 27 సం?రాల సుదీర&ఋు జైలుశిక్షను అనుభవించిన తరువాత అంతర్జాతీయ మరియు జాతీయ ఒత్తిడిలకు తలొగ్గిన యఫ్ డబ్ల్యూ డీ క్లార్క్ ప్రభుత్వం 11 ఫిబ్రవరి 1990న నెల్లన్ మండేలాను విడుదల చేసింది. జైలు గది సంఖ్య 466 మరియు జైలుశిక్ష పడిన సం?రం 63(1963)లను కలిపి 46663ని మండేలా సంఖ్యగా పిలుస్తారు. విడుదల అనంతరం శ్వేతజాతి మైనారిటీ ప్రభుత్వంతో చర్చలు జరిపిన పిదప 1994లో నిర్వహించిన ఎన్నికలలో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రేస్ తరఫున పోటీ చేసి సంకీర్ణ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చి, దక్షిణాఫ్రికా ప్రథమ నల్లజాతి అధ్యక్షుడిగా ఎన్నికైనారు. వర్ణ వివక్షను రూపుమాపుతూ కొత్త రాజ్యాంగాన్ని రూపొందించారు. భూ సంస్కరణలు, పేదరిక నిర్మూలనకు ప్రాధాన్యమిస్తూ, సుపరిపాలన అందించే ప్రయత్నం చేశారు. దీనికి తోడుగా 1998-99 మధ్య అలీనోద్యమానికి సెక్రటరీ జనరల్‌గా విశేష సేవలందించారు. మండేలా 80వ పుట్టిన రోజున 1998లో 'గ్రాకా మాచల్'ను వివాహమాడారు. దేశ అధ్యక్ష పదవిని రెండవ దఫా స్వీకరించేందుకు అంగీకరించక, నెల్సన్ మండేలా ఫౌండేషన్స్ ద్వారా ఏయిడ్స్ మరియు పేదరికానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. సామాజిక న్యాయం మరియు ప్రజాస్వామ్య జ్యోతిగా వెలుగొందిన మండేలాను 250కి పైగా పురస్కారాలు వరించాయి. వీటిలో ముఖ్యమైన నోబెల్ శాంతి బహుమతి, భారత రత్న, జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ సయోధ్య పురస్కారాలకు ఎంపికైనారు. దక్షిణాఫ్రికా జాతిపితగా గుర్తింపుతో పాటుగా ప్రతిష్టాత్మక 'మడిబా' బిరుదును పొందిన మండేలా 5 డిసెంబర్ 2013 రోజున తుది శ్వాస విడిచారు.

అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం సందర్భంగా పేదలకు అన్నదానాలు, వృద్ధుల పట్ల ఆదరణ, యువతకు ప్రేరణాత్మక కార్యక్రమాలు, యువతతో స్వచ్ఛంధ సేవలు, పరిసరాల పరిశుభ్రత లాంటి సమాజహిత కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి. నెల్సన్ మండేలా 67 ఏండ్ల జీవనసారాన్ని అర్థం చేసుకొని ఈ ఒక్క రోజే కాకుండా ప్రతి రోజూ కనీసం 67 నిమిషాలు విశ్వశాంతి, పేదరిక నిర్మూలణలకు దోహదపడే సేవాకార్యక్రమాలను నిర్వహించటానికి ప్రయత్నం చేద్దాం. 'లాంగ్ వాక్ టు ఫ్రీడం' అనే పేరుతో తన ఆత్మకథను మన ముందుంచిన నెల్సన్ మండేలా త్యాగాలు నేటికీ అనన్య సామాన్యాలు మరియు అనుసరణీయాలు. హింసా మార్గంలో ఉద్యమాలు ప్రారంభించిన మండేలా గాంధేయ వాదానికి ఆకర్షితుడై పోరాటాలు చేసిన తీరు ప్రశంసనీయం. వర్ణసమానత్వం, స్వేచ్ఛా సమాజం, సమానావకాశాలు, సుహృద్భావ వాతావరణం, ప్రజాస్వామ్య పరిరక్షణ మరియు అందరికి అందుబాటులో విద్యల సాధనకు అంకితభావంతో సేవలందించిన 'దక్షిణాఫ్రికా గాంధీ' జీవితం విశ్వ మానవాళికి నిత్యప్రేరణ కలిగిస్తూ, రేపటి వెలుగులు చూపే నల్లజాతి మండే సూరీడుగా మరియు భవిష్యత్తుకు దారులు చూపే దీపస్తంభంగా నిలబడగలదని నిస్సందేహంగా చెప్పవచ్చు.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

కాంగ్రెస్ అభివృద్ధి నిరోధక పార్టీ

సచివాలయ నిర్మాణాన్ని అడ్డుకోవడంతో ఏడాది వృథా
ఇప్పటికే సచివాలయం సగం పూర్తయ్యేది
సమీకృత సచివాలయంతో నెలకు 30కోట్ల వరకు ఆదా: కర్నె

హైదరాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): విపక్షాలు అడ్డుపడి కోర్టుకెక్కకుండా ఉండివుంటే ఈ పాటికి సచివాలయ నిర్మాణం పూర్తయ్యేదని మండలిలో ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ అన్నారు. ఏడాది క్రితం సిఎం కెసిఆర్ సమీకృత సచివాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని అన్నారు. ఈ సచివాలయం అందుబాటులోకి వస్తే నెలకు 30కోట్ల వరకు డబ్బు ఆదా అవుతుందని అన్నారు. అయితే అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు పనిచేస్తున్నారని ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి సమావేశాల్లోనే కాంగ్రెస్ నేతలు గందరగోళం సృష్టించారని, అభివృద్ధిని అడ్డుకుంటూ వికృతానందం పొందుతున్నారని మండిపడ్డారు. శాసనమండలి ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సమీకృత సచివాలయ నిర్మాణంతో ప్రభుత్వ కార్యాలయాలు ఒక్కచోటికి రానున్నాయనిఅన్నారు. ఇది పాలకులకు,దికారులక, ప్రజలకు కూడా మంచి సౌకర్యం కానుందని అన్నారు. గతేడాది జూన్‌లో సిఎం శంకుస్థాపన చేయగా కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుపడి ఏం సాధించారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజల కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేస్తున్నదని చెప్పారు. పాలనా సౌలభ్యంకోసమే కొత్త సచివాలయం నిర్మించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారని వెల్లడించారు. అన్ని కార్యాలయాలను ఒకే గొడుగు కిందికి తేవడానికే కొత్త సచివాలయ నిర్మాణమని చెప్పారు. ప్రస్తుత సెక్రటేరియట్‌లో పార్కింగ్ స్థలం, క్యాంటీన్ కూడా లేవన్నారు. కాంగ్రెస్ నేతలు అడ్డుపడకుంటే కొత్త సచివాలయం ఈపాటికే సగం పూర్తయ్యేదని తెలిపారు. మంత్రి మండలి నిర్ణయాల్లో జోక్యంచేసుకోబోమని హైకోర్టు చెప్పినా కాంగ్రెస్ నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉస్మానియా దవాఖానను కొత్తగా నిర్మిస్తామని ముఖ్యమంత్రి అనగానే.. దాన్ని అడ్డుకుంటామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్పిటల్‌కు సంబంధించి కొత్త నిర్మాణాలను అడ్డుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కడుతున్నప్పుడు కూడా ఆ పార్టీ నేతలు వికృత చర్యలకు పాల్పడ్డారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కనీసం తాగునీరు కూడా ఇవ్వలేదని విమర్శించారు. మిషన్ భగీరథకు ఆర్థిక సాయం చేయొద్దని కేంద్రానికి కాంగ్రెస్ నేతలు లేఖరు రాశారని వెల్లడించారు. కాంగ్రెస్ తాను చేయదు..ఇతరలను చేయనివ్వదని, అందుకే ప్రజలు ఆ పార్టీని దూరం పెట్టారని అన్నారు.

పాలనా సౌలభ్యం కోసమే సచివాలయ నిర్మాణం

ప్రభుత్వ కార్యాలయాలు ఒక్కచోట చేర్చాలన్నదే లక్ష్యం
కాంగ్రెస్ నేతలు అడ్డుకునే పంథాను ఇకనైనా వీడాలి: చారి

హైదరాబాద్,జూలై18(ఆర్ఎన్ఎ): పాలనా సౌలభ్యంకోసమే కొత్త సచివాలయం నిర్మించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారని టిఆర్ఎస్ నేత, మాజీకేంద్రమంత్రి డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి వెల్లడించారు. సచివాలయ విసిరేసినట్లుగా కాకుండా క్రమపద్ధతిలో ఉండాలని కోరుకోవడంలో తప్పులేదన్నారు. ఉమ్మడి పాలనలో కాంగ్రెస్ నేతలు ఇలాంటి ఆలోచన ఎందుకు చేయలేదని శనివారం నాడిక్కడ ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయాలు విసిరేసినట్లుగా కాకుండా ఒకేచోటు ఉండడం వల్ల ప్రజలకు మేలు కలుగుతుందన్న ఆలోచన వారుచేయలేదన్నారు. స్వలాభాపేక్ష మాత్రమే చేసే కాంగ్రెస్ నేతలు సచివాలయం లాంటి విషయంలో తప్పుడు ఆరోపణలు చేయడంతగదన్నారు. కోర్టులకు వెళ్లి అడ్డుకోవడం లాంటివి తప్ప వారు చేయగలిగేదేమీ ఉండదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు పనిచేస్తున్నారని, దీనిని ప్రజలు కూడా సహించరని గుర్తుంచుకోవాలన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటూ పోతామని అనుకుంటే ప్రజలు వారిని మొత్తంగాపనే అడ్డుకుంటారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేస్తున్న విషయాన్ఇన వారు గమనించి ముందుకు పోవాలని చెప్పారు. అదేపనిగా ప్రభుత్వ సంకల్పాన్ని అడ్డుకోవాలనుకుంటేసదరని పని అన్నారు. కొత్త సచివాలయ నిర్మాణంతో అన్ని కార్యాలయాలను ఒకే గొడుగు కిందికి తేవడానికేనని చెప్పారు. ప్రస్తుత సెక్రటేరియట్‌లో పార్కింగ్ స్థలం సరిగా ఉందా అన్నది చెప్పాలన్నారు. కాంగ్రెస్ నేతలు అడ్డుపడకుంటే కొత్త సచివాలయం ఈపాటికే పూర్తయ్యేదని తెలిపారు. మంత్రిమండలి నిర్ణయాల్లో జోక్యంచేసుకోబోమని హైకోర్టు చెప్పినా కాంగ్రెస్ నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకనుంచి అడ్డుకోవడంఅన్న పంథా నుంచి కాంగ్రెస్ నేతలు తప్పుకోవాలని చారి అన్నారు.

ఉస్మానియా దవాఖానను కొత్తగా నిర్మించడానికి సిఎం కంకణబద్ధులై ఉన్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కడుతున్నప్పుడుకూడా ఆ పార్టీ నేతలు అదేపనిగా అడ్డుకోవడం చూశామని, అయితే నీళ్లు రావడంతో ఇప్పుడు వారు మరో రకంగా విమర్శలు చేస్తున్నారని తెలిపారు.

అవినీతి కేసుల్లో అరెస్టులపై తప్పుడు ప్రచారం

నేరాలను కప్పిపుచ్చుకునేందేకే రాష్ట్రపతికి ఫిర్యాదు

అమరావతి,జూలై18(ఆర్ఎన్ఎ): అవినీతికి పాల్పడి కేసుల్లో అరెస్టులపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ అరెస్ట్‌లు, నేరాలను కప్పిపుచ్చుకునేందుకే టీడీపీ నేతలు రాష్ట్రపతిని కలిశారని ఆయన ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల పాలనలో టీడీపీ రాజ్యాంగానికి తూట్లు పొడిచింది. టీడీపీ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. ఇంగ్లీష్ మీడియాన్ని అడ్డుకుని పేదలకు టీడీపీ అన్యాయం చేసింది. ఇంగ్లీష్ మీడియంపై రాష్ట్రపతి మిమ్మల్ని ప్రశ్నిస్తే టీడీపీ ఏం సమాధానం చెబుతుంది?. చంద్రబాబు పీఎస్ ఇంట్లో సోదాల తర్వాత 2వేల కోట్ల లావాదేవీలకు ఆధారాలు బయటపడ్డాయి.చంద్రబాబుకు రాజ్యాంగం, ప్రజాసామ్యంపై విశ్వాసం లేదని ఆయన దుయ్యబట్టారు. సంక్షోభంలో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి సురేష్ తెలిపారు. ఇంగ్లీష్ మీడియాన్ని అడ్డుకుని పేదల పిల్లలకు టీడీపీ అన్యాయం చేసిందన్నారు. పేద ప్రజల బిడ్డలు ఎదగడం టీడీపీ నేతలకు ఇష్టం లేదని విమర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా దళితుడిని నియమిస్తే అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. పరిపాలన వికేంద్రీకరణ, అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి పాటు పడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. సీబీఐ, సీఐడీలపై కూడా టీడీపీ నేతలకు నమ్మకం లేదు. టీడీపీ నేతలు కేసుల నుంచి తప్పించుకునేందుకే ఢిల్లీకి వెళ్లారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. వైఎస్సార్ చేయూత కింద మహిళలకు కొత్త పథకాలు ప్రవేశ పెడుతున్నాం. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి గతం కంటే ఎక్కవ నిధులు కేటాయించామని మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు.

ప్రభుత్వం కళ్ళు తెరచి ప్రజలను ఆదుకోవాలి

"స్పీకప్ తెలంగాణ" వేములవాడ నిజయోకవర్గ ఇంచార్జ్ సీనియర్ నాయకుడు ఆది శ్రీనివాస్

వేములవాడ, జులై 18(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు "స్పీకప్ తెలంగాణ" పాల్గొని నిర్లక్ష్యం పై గళమెత్తిన వేములవాడ నిజయోకవర్గ ఇంచార్జీ ఆది శ్రీనివాస్ తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కళ్ళు తెరిచి రాష్ట్ర ప్రజలను ఆదుకోవాలని ఆయన అన్నారు. ఆసుపత్రులలో సరైన వైద్యం అందక ఎంతో మంది నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులలో బెడ్లు దొరకక ఆసుపత్రుల చుట్టూ తిరిగి తిరిగి వైద్యం అందక తమ ప్రాణాలు కోల్పోవడం జరిగుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎందరో పోలీసులు, పారిశుద్ధ్య, జర్నలిస్టులు, వ్యాపార, వాణిజ్య అన్ని రంగాలకు చెందిన వారు ఉన్నారు అని ఆయన తెలిపారు. నిన్న హైదరాబాదులో ఒక ఎస్సై సరైన వైద్యం అందక మరణించడం బాధాకరమన్నారు, సిద్దిపేట జిల్లాలో 108 వాహనం సరైన సమయానికి రాక ఒక వ్యక్తి మరణించడం జరిగింది, ఇలాంటి ఘటనలు ఎన్నో ఉన్నాయి. కావున ఈ ప్రభుత్వం వెంటనే కళ్ళు తెరిచి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు, కరోనా చికిత్స ఆరోగ్య శ్రీ లో చేర్చి ఉచితంగా వైద్యం అందించాలి. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో వెంటిలేటర్లు, ఆక్సిజన్ సిలిండర్లు సరిపడా ఏర్పాటుచేసి సరైన చికిత్స అందించాలన్నారు, కరోనా వల్ల మరణాల బారిన పడిన వారికి పది లక్షల నష్టపరిహారం చెల్లించాలి, కరోనా నియంత్రణలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది, పోలీసులు, వైద్య సిబ్బంది, విలేకరులు ఎవరు చనిపోయిన వారికి 50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలన్నారు, ఆసుపత్రులలో ఛార్జీలను నియంత్రించి 50% పడకలను ప్రభుత్వం నియంత్రణలోకి తీసుకోవాలి. కరోన టెస్టుల సంఖ్య పెంచాలి. హోమ్ ఐసోలేషన్ కోసం జిల్లాలోని హోటళ్లలో 50% గదులు ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తగిన ఏర్పాట్లు చేసి వైద్యం అందించాలి ఆది శ్రీనివాస్ వేములవాడ కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సంగ స్వామి యాదవ్,కాంగ్రెస్ నాయకులు మాడికి చంద్రశేఖర్ నంద్రగిరి శ్రీనివాస్ గౌడ్,కనికరపు రాకేష్ తదితరులు పాల్గొన్నారు

కరోనా సోకిన వారికి చెన్నైలో చికిత్స: వైవి

తిరుమల,జూలై 18(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారి ఆలయంలో కైంకర్యాల పర్యవేక్షకులకు అనారోగ్యంపై తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. అనారోగ్యానికి గురైన అర్చకులను మెరుగైన వైద్యంకోసం చెన్నైలోని అపోలో దవాఖానకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కైంకర్యాల పర్యవేక్షకుల ఆరోగ్యం నిలకడగానే ఉందని చెప్పారు. భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడించారు. ఆలయంలో కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా శ్రీవారి దర్శనాల కొనసాగింపు అంశంపై మరోమారు సమీక్ష జరుపుతామని చెప్పారు. స్వామివారికి కైంకర్యాలు నిర్వహించే 50 మంది అర్చకుల్లో 15 మందికి కరోనా వైరస్ సోకింది. మరో ఇద్దరికి కరోనా లక్షణాలు ఉండటంతో వారు కూడా శ్రీవారి కైంకర్యాలకు దూరమయ్యారు. దీంతో స్వామివారి కైంకర్యాలకు అంతరాయం ఏర్పడకుండా తిరుపతిలోని గోవిందరాజుల స్వామి ఆలయంలో పనిచేస్తున్న అర్చకులను డిప్యుటేషన్‌పై శ్రీవారి ఆలయంలో నియమించారు.

పెళ్లిళ్లకు ఇక తహసిల్దార్ అనుమతి చాలు

కలెక్టర్ నుంచి అధికారాలు బదిలీ చేస్తూ ఉత్తర్వులు

అమరావతి,జూలై18(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాధి మరింతగా పెరిగిపోతుందనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా పెండ్లిళ్లకు ఎంతమందిని అనుమతించాలనే విషయంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వరకు పెండ్లిళ్ల అనుమతి విషయంలో కలెక్టర్ నుంచి అనుమతి పొందాల్సి వచ్చేది. దీని కారణంగా అనుమతులు ఆలస్యం అవుతుండడంతో ఇకపై ఈ వ్యవహారాలను తాసిల్దార్‌లకి అప్పగిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ముఖ్యంగా జులై 21 నుంచి శ్రావణ మాసం ప్రారంభం అవుతుండడంతో పెద్ద ఎత్తున వివాహాలు జరిగే అవకాశం ఉన్నది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ స్థాయిలో పెండ్లిళ్లకు అనుమతులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే పెండ్లిళ్లకు మాత్రమే అనుమతి ఇవ్వాలని, మిగతా ఎటువంటి ఫంక్షన్లకు అనుమతి ఇచ్చేది లేదని ప్రభుత్వ నిబంధనల్లో పేర్కొన్నది ,.పెండ్లి కుమారుడు పెండ్లి కుమార్తె ఇరువైపులా కేవలం ఇరవై మందికి మాత్రమే అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం జీవోలో పేర్కొన్నది. పెండ్లిళ్ల అనుమతి కోరే వారు తప్పనిసరిగా వివాహ శుభలేఖతో పాటు, నాన్ జ్యూడిషియల్ స్టాంప్ పై అఫిడవిట్ ను తాసిల్దార్ కు సమర్పించాల్సి ఉంటుందని, దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డుతో పాటు, కరోనా పరీక్షలు చేయించుకున్నట్టుగా వైద్యులు ఇచ్చిన ధ్రువపత్రాలను, జతచేయాలని ప్రభుత్వం జీవోలో తెలిపింది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే జాతీయ విపత్తు నిర్వహణ చట్టం 2005 లోని సెక్షన్ 188 ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలో స్పష్టంగా తెలిపింది.

ఇసుకపై అసమర్థ విధానాలు

మండిపడ్డ బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి

విజయవాడ,జూలై18(ఆర్ఎన్ఎ): ఇసుక కోసం ఏపీ ప్రభుత్వం కొత్తగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ ఈ వ్యవహారంపై ప్రతిపక్ష పార్టీల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా.. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి స్పందించారు. ఇసుక సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే అసమర్థ నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఇసుక కోసం గ్రామీణ ప్రాంత ప్రజలకు సొంత అవసరాలకు వాడుకునే వారికి నిబంధనలు సడలించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించారు. ఇసుకపై తక్షణం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కనీసం నూతన పాలసీలో ప్రజలను, అన్ని పార్టీలను భాగస్వామ్యం చేసి, అభిప్రాయాలు సేకరించాలన్నారు. గతంలో తీసుకొచ్చిన రెండు ఇసుక పాలసీల వైఫల్యమని మీ ప్రభుత్వం ఒప్పుకున్నట్లే కదా?. అప్పుడలా.. ఇప్పుడేమో మరో నూతన కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామంటున్నారు. ఒకే ప్రభుత్వం సంవత్సరంలో మూడు విధానాలు తీసుకొస్తారా?. అంటే మీ వైపల్యాలను కప్పిపుచ్చు కోనేందుకే రోజుకొక పాలసి తెస్తారా..?. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీల దగ్గరికి ఇసుక కోసం ప్రజలు రెకమండేషన్ కోసం వెళ్తున్నారు. కొత్త విధానం వల్ల ప్రజలకు ఎలా మేలు జరుగుతుందో ప్రభుత్వం చెప్పాలని ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

వరంగల్ జిల్లాలో ప్రారంభోత్సవాలకు సిద్ధంగా టీఆర్ఎస్ కార్యాలయాలు

జనగామ, జులై 18 : టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు.. ప్రతి జిల్లాకు పార్టీ కార్యాలయంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం మూడు పార్టీ కార్యాలయాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని.. మరో మూడు కార్యాలయాలను నెల రోజుల్లోగా సిద్ధం చేస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆయా కార్యాలయాలను సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు జరిపిస్తామని మంత్రి తెలిపారు. జనగామ పార్టీ కార్యాలయాన్ని మంత్రి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టర్ కు తగు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి జిల్లాకో పార్టీ కార్యాలయాన్ని నిర్మించాలన్న పార్టీ ఆదేశాలకనుగుణంగా అత్యంత వేగంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలోని భూపాలపల్లి, హనుమకొండ (వరంగల్), ములుగు పార్టీ కార్యాలయాలు నిర్మాణ తుది దశలో ఉన్నాయన్నారు. మహబూబాబాద్, జనగామ జిల్లాల పార్టీ కార్యాలయాలను నెల రోజుల్లోగా సిద్ధం చేస్తామన్నారు. పార్టీ కార్యాలయాలు ప్రారంభమైతే పార్టీ కార్యకలాపాలన్నీ అందులోనే జరుపుకునే వీలు కలుగుతుందన్నారు. పార్టీ కార్యాలయాలు సర్వాంగ సుందరంగా సకల సదుపాయాలతో నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్పించి ఉచిత వైద్యంను అందించాలి

– స్పీకప్ తెలంగాణ లో జడ్పిటిసి నాగం కుమార్
– ఎంపీటీసీ మ్యాకల గణేష్

వేములవాడ, జులై 18(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు "స్పీకప్ తెలంగాణ" లో పాల్గొని నిర్లక్ష్యం పై గళమెత్తి న చందుర్తి జడ్పిటిసి నాగం కుమార్, జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేష్‌తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కళ్ళు తెరిచి రాష్ట్ర ప్రజలను ఆదుకోవాలని వారు అన్నారు. ఆసుపత్రులలో సరైన వైద్యం అందక ఎంతో మంది నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులలో బెడ్లు దొరకక ఆసుపత్రుల చుట్టూ తిరిగి తిరిగి వైద్యం అందక తమ ప్రాణాలు కోల్పోవడం జరిగుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎందరో పోలీసులు, పారిశుద్ధ్య, జర్నలిస్టులు, వ్యాపార, వాణిజ్య అన్ని రంగాలకు చెందిన వారు ఉన్నారు వారు తెలిపారు. నిన్న హైదరాబాదులో ఒక ఎస్సై సరైన వైద్యం అందక మరణించడం బాధాకరమన్నారు, సిద్దిపేట జిల్లాలో 108 వాహనం సరైన సమయానికి రాక ఒక వ్యక్తి మరణించడం జరిగింది, ఇలాంటి ఘటనలు ఎన్నో ఉన్నాయి. కావున ఈ ప్రభుత్వం వెంటనే కళ్ళు తెరిచి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు, కరోనా చికిత్స ఆరోగ్య శ్రీ లో చేర్చి ఉచితంగా వైద్యం అందించాలి. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో వెంటిలేటర్లు, ఆక్సిజన్ సిలిండర్లు సరిపడా ఏర్పాటుచేసి సరైన చికిత్స అందించాలన్నారు, కరోన వల్ల మరణాల బారిన పడిన వారికి పది లక్షల నష్టపరిహారం చెల్లించాలి, కరోనా నియంత్రణలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది, పోలీసులు, వైద్య సిబ్బంది, విలేకరులు ఎవరు చనిపోయిన వారికి 50 లక్షలు నష్టప